


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 279, పేజీలు - 08

శుక్రవారం, మార్చి 27, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# విద్య, వైద్యం మా ప్రభుత్వ ప్రాధాన్యత

- ఆరోగ్యశ్రీ బకాయిలపై వస్తున్నవి దుష్ప్రచారాలేనన్న సీఎం
- రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలు
- భోధనాసుపత్రులకు ఆరోగ్యశ్రీ రోగులను రెఫర్ చేసే ఆలోచనలో ప్రభుత్వం
- సీఎం సహాయకనిధికి ఆన్లైన్ దరఖాస్తులతో అక్రమాలకు అడ్డుకట్ట వేశామన్న సీఎం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం గడిచిన 27 నెలల కాలంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు.శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అనేక అంశాలను తెలిపారు.

### 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

'రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నాం. పేదలకు జీవిత బీమాను అందించి వారిలో ధీమా కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతోంది'అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం. గడిచిన 27 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 2,400 కోట్లు మొత్తంగా రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### గత ప్రభుత్వ బకాయిలు చెల్లించాం

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ప్రతి నెలా సగటున రూ.52 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత 7 డిసెంబర్ 2023 నుంచి 25 మార్చి 2026 కాలంలో ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ. 89 కోట్లు ఖర్చు పెట్టింది' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

2లో..

## హైదరాబాద్‌తో పోల్చొద్దు..

### బెంగళూరు స్థాయి వేరు

- డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) బెంగళూరు నగరాన్ని హైదరాబాద్‌తో పోల్చవద్దని, ఈ రెండు నగరాల మధ్య పోలిక సరికాదని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రపంచ టెక్ హబ్స్ జాబితాలో 6వ స్థానంలో ఉన్న బెంగళూరును, 26వ స్థానంలో ఉన్న హైదరాబాద్‌తో పోల్చడం తగదని ఆయన అన్నారు. గురువారం కర్ణాటక శాసనసభలో బెంగళూరు అభివృద్ధిపై జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం, ప్రపంచంలోని టాప్ 10 టెక్ హబ్స్‌లో బెంగళూరు ఒకటిగా నిలిచింది. ఈ జాబితాలో శాన్ ఫ్రాన్సిస్కో మొదటి స్థానంలో, లండన్ రెండో స్థానంలో ఉన్నాయి.

2లో..

## నిల్వలు ఉన్నా

# ఇంధన సెగ

- హైదరాబాద్‌లో పెట్రోల్ కష్టాలకు కారణం ఎవరు..?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో గత కొన్ని రోజులుగా ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడటం సామాన్య వాహనదారులను ఇబ్బంది పెడుతోంది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని అటు కేంద్ర పెట్రోలియం శాఖ, ఇటు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చెబుతున్నప్పటికీ, బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమివ్వడం గందరగోళానికి దారితీస్తోంది. ప్రభుత్వ లెక్కల్లో నిల్వలు పుష్కలంగా ఉన్నా, అవి వినియోగదారుడి వాహనం దాకా చేరకపోవడమే అసలు సమస్యగా మారింది.

### మారిన రూల్స్‌తో సమస్యలు

నిల్వలు ఉన్నప్పటికీ బంకులకు చేరకపోవడానికి ప్రధాన కారణం 'సప్లై చైన్' లేదా రవాణా వ్యవస్థలో తలెత్తిన లోపాలేనని తెలుస్తోంది. చమురు కంపెనీల డిపోల నుండి బంకులకు ఇంధనాన్ని చేరవేసే ట్యాంకర్ల లభ్యత తగ్గడం లేదా రవాణా కాంట్రాక్టర్ల మధ్య తలెత్తిన సమన్వయ లోపం వల్ల సకాలంలో లోడింగ్

2లో..

## ఒకే గొడుగు కిందకు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలు

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భూముల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పోర్టల్ తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ తప్పుల తడకగా ఉందని ఉన్న సమస్యలు తీర్చడం సంగతి అటుంచితే కొత్త సమస్యలను తెచ్చిపెట్టిందని కాంగ్రెస్ పార్టీ ముందు నుంచీ ఆరోపణలు చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తీసుకువచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ ప్రయోగాత్మకంగా మొదట పైలట్ ప్రాజెక్టు కింద 5 మండలాల్లో అమలు చేయనుంది. ఈ నేపథ్యంలోనే వచ్చే నెల (ఏప్రిల్) 2వ తేదీ నుంచి ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను అమలు చేయనున్నట్లు తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

2లో..

# రాజధాని అమరావతికి చట్టబద్ధత

- రాష్ట్రవ్యాప్తంగా 96 కొత్త సివిల్ జడ్జి కోర్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- ఆస్తి పన్ను వడ్డీ మాఫీ, పలు సంస్థలకు భూ కేటాయింపులపై నిర్ణయం
- వడ్డెర సంఘాలకు ఖనిజ లీజుల్లో 50 శాతం రాయితీకి ఆమోదం

## ఏపీ కేబినెట్ కీలక తీర్మానాలు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం సమావేశమైన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కి చట్టబద్ధత కల్పిస్తూ ఏపీ మంత్రివర్గం చారిత్రత్మకమైన తీర్మానం చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్-5ని సవరించాలని కేబినెట్ తీర్మానించింది. ఇక కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని చంద్రబాబు సర్కార్ భావిస్తోంది. సీఆర్డీఏ పరిధిలోని అమరావతి పేరును కొత్త రాజధానిగా చేర్చాలని ప్రతిపాదనలు చేసింది. దీనికి సంబంధించి తాజాగా నిర్వహించిన కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈనెల 28వ తేదీన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 4 గంటల పాటు రాజధాని అమరావతిపై చర్చను నిర్వహించి తీర్మానించాలని నిర్ణయం

2లో..

## ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

- త్వరగా నిర్ణయం తీసుకోకపోతే అంతమే



2లో..

## మార్కాపురంలో

# ఘోర బస్సు ప్రమాదం

- 13 మంది సజీవ దహనం
- సీఎం చంద్రబాబు,లోకేష్ తో పాటు మంత్రుల దిగ్భ్రాంతి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** గురువారం ఉదయం మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా వణికించింది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా నుంచి 35 మందితో వెళ్తున్న హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ఆ ప్రైవేటు బస్సు రాయవరం సమీపంలోకి రాగానే పలకల క్వారీ వద్ద టిప్పర్‌ను ఢీకొట్టడంతో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 13 మంది సజీవ దహనం అయ్యారు. మరో 22 మందికి తీవ్ర గాయాలు అయినట్లు అధికారులు వెల్లడించారు. వారిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ బస్సు ప్రమాదంపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి, తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అయితే ఈ బస్సు ప్రమాదం బాధిత కుటుంబాలకు అంతులేని విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో ఇప్పటి దాకా 13 మంది మృతదేహాలను బయటికి తీశారు. ఇక ఈ బస్సు ప్రమాదానికి సంబంధించి తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బస్సు కండీషన్ సరిగా లేదని ప్రమాదానికి ముందే అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆ బస్సు పరిస్థితి బాగా లేదని ముందే డ్రైవర్‌తో చెప్పారు. ఈ క్రమంలోనే యర్రగొండపాలెం వద్ద బస్సును గంటసేపు నిలిపేసిన డ్రైవర్ దానికి మరమ్మతులు చేసినట్లు ప్రయాణికులు వెల్లడించారు. రిపేర్ల తర్వాత బస్సు బయల్దేరి కొంత దూరం వెళ్లిన తర్వాత రాయవరం వద్ద ఈ ఘోర ఘటన జరిగినట్లు చెప్పారు. ఈ ప్రమాదం తర్వాత అధికారులు బస్సు డ్రైవర్‌ను విచారణ

2లో..

## అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు

- ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్య పెంచాలన్న సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో ఎంఎంటీఎస్ రైళ్లు అంటే తెలియని వారు ఉండరు. నగరంలో చాలా దూరం ప్రయాణించినా అతి తక్కువ టికెట్ ధరతో ఈ ఎంఎంటీఎస్ రైళ్లలో దూసుకెళ్లిపోవచ్చు. ట్రాఫిక్, అధిక ఖర్చు లేకుండా వెళ్లొచ్చు. అయితే ఎంఎంటీఎస్ రైళ్లతో వచ్చిన అతిపెద్ద సమస్య ఏంటంటే సమయానికి రైళ్లు రావు. మరోవైపు ఎంఎంటీఎస్ రైళ్లు నడిచే రైల్వే స్టేషన్‌లకు బస్‌స్టాప్‌ల మధ్య సరైన కనెక్టివిటీ లేకపోవడం వల్ల కూడా వాటిని ఉపయోగించుకునే వారి సంఖ్య అంత పెద్దగా ఉండటం లేదు. దీనివల్ల హైదరాబాద్ నగర వాసులు మెట్రో, బస్సులు,

2లో..

## అసెంబ్లీని నడపలేక ప్రభుత్వం క్రీడాపోటీల ఎత్తుగడ వేసింది

- ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేకేనని కేటీఆర్ విమర్శ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వం సభను నడపలేక క్రీడా పోటీల ఎత్తుగడ వేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన పిచ్చాపాటిగా మాట్లాడుతూ, సభలో కీలకమైన అంశాలపై చర్చను పక్కన పెట్టేందుకు ప్రభుత్వం ఆటల పోటీలకు తెరతీస్తోందని విమర్శించారు. ఇరిగేషన్ వంటి కీలక

2లో..

## ఈజ్ ఆఫ్ లివింగ్‌లో భాగ్యనగరానికి అగ్రస్థానం

- బెంగళూరును వెనక్కి నెట్టిన హైదరాబాద్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడుతూ విశ్వనగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. నగరంలో ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన వారు కూడా నగరంలో ఉపాధి పొందుతున్నారు. ఈ మేరకు హైదరాబాద్ మహానగరం మరోసారి తన సత్తా చాటింది. దేశంలోని మెట్రో నగరాలన్నింటిని వెనక్కి నెట్టి 'నివసించడానికి అత్యంత

2లో..

# విద్య, వైద్యం మా ప్రభుత్వ ప్రాధాన్యత

'గత ప్రభుత్వం బకాయిల భారాన్ని మాపై పెట్టింది. ఆ భారాన్ని మోస్తూనే రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాం. 7 డిసెంబర్, 2023 నాటికి గత ప్రభుత్వం నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ. 600.27 కోట్లు. అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 240.11 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 360.16 కోట్ల బకాయి ఉంది'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### రూ. 2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించాం

'ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఈరోజు వరకు రూ. 2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించాం. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927.99 కోట్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ. 1,480.52 కోట్లు చెల్లించాం. నెలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 34 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 54 కోట్లు అందించాం'అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ. 725.75 కోట్లు బకాయి ఉంటే, అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టిన మొత్తం రూ. 600 కోట్లు. గత ప్రభుత్వ బకాయి పోగా గడిచిన 28 నెలల కాలంలో ఈ ప్రభుత్వ బకాయి కేవలం రూ. 100 కోట్లు మాత్రమే. ఇందులోనూ ప్రభుత్వ ఆసుపత్రులకే ఎక్కువగా రూ. 496.31 కోట్లు బకాయి ఉంటే, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 231.44 కోట్లు ఉంది'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునిక వైద్యం అందేలా చర్యలు

'రాష్ట్రంలో నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం పేదల్లో ధీమా కల్పించాలన్న సంకల్పంతోనే 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా తెస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స అందడం లేదన్న వాదన వాస్తవం కాదు. సీఎంఆర్ఎఫ్ గతంలో ఎలా దుర్వినియోగమైందో అందరికీ తెలిసిందే. అందుకని మరింత పారదర్శకంగా ప్రజాప్రతినిధులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి వీలు కల్పించాం. నిమ్స్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు 3 వేల కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి కలిపి రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నాం. పనులు వేగంగా జరుగుతున్నాయి'అని సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రకటించారు.

### పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తాం

'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు వైద్యం కోసం టీచింగ్ హాస్పిటల్స్‌కు పంపిస్తే తద్వారా అక్కడున్న నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడానికి అలాగే వైద్య విద్యార్థులకు వృత్తిరీత్యా ఎంతో అనుభవం వస్తుంది. చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ఇన్సెంటివ్స్ కూడా ఇవ్వాలన్న ఆలోచన చేస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి సభలో ప్రకటించారు. 'పేదలకు మరింత వేగవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆసుపత్రుల నిర్వహణ విధానంలో కూడా మార్పులు చేస్తున్నాం. వైద్యులకే హాస్పిటల్ నిర్వహణ బాధ్యత అప్పగించడం వల్ల వైద్యంపై దృష్టి సారించలేని పరిస్థితులు ఉంటున్నాయి. అందుకని నిర్వహణ విభాగాన్ని వేరు చేయాలన్న ఆలోచన చేస్తున్నాం. విదేశాల్లో గొప్ప పేరు గడించిన వైద్యులు తల్లిదండ్రుల కోసమో, ఇతర పనుల కోసం రాష్ట్రానికి వచ్చినప్పుడు వెసులుబాటును బట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పేదలకు వారి సేవలను అందించడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ వెబ్‌సైట్ ద్వారా ఒక వేదికను క్రియేట్ చేస్తున్నాం'అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### విద్య, వైద్యం ప్రాధాన్యత

'సమాజంలో వైద్య రంగం ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రజలకు ఉపయోగపడే సూచనలను స్వీకరిస్తాం. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యం. విద్య పరంగా నర్సరీ నుంచి 10 వరకు, వైద్యం పరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ఒక ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. మంచి రోల్ మాడల్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్రంగా వివరించారు.

# హైదరాబాద్‌తో పోల్చొద్దు..

5వ స్థానంలో ఉన్న బీజింగ్ తర్వాత బెంగళూరు 6వ స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ 26వ స్థానంలో ఉంది. అందుకే, హైదరాబాద్‌తో పోటీ పడాలని నేను అనుకోవడం లేదు" అని శివకుమార్ వివరించారు.ఈ చర్చలో మాజీ ఉప ముఖ్యమంత్రి సీఎన్ అశ్వత్ నారాయణ్ జోక్యం చేసుకుంటూ, దేశంలో బెంగళూరుతో పోల్చదగిన నగరం మరొకటి లేదన్నారు. జీవన వ్యయం విషయంలో హైదరాబాద్ 50 శాతం తక్కువగా ఉండొచ్చని, కానీ బెంగళూరులో ఉన్న ప్రతిభ, కాస్మోపాలిటన్ సంస్కృతి మరెక్కడా లేవని తెలిపారు. బెంగళూరు అభివృద్ధిలో ప్రభుత్వాల పాత్ర నామమాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు స్పందిస్తూ.. ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం వల్లే బెంగళూరుకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, అదే ఐటీ విప్లవానికి బాటలు వేసిందని అన్నారు. ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ మాట్లాడుతూ, మీడియానే రెండు నగరాలను పోలుస్తోందని, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున ఈ విషయం రాజకీయంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. డీకే శివకుమార్ బెంగళూరు ఘనతను వివరిస్తూ నగరంలో 26 లక్షల మంది ఐటీ నిపుణులు, 400 ఫార్చ్యూన్ 500 కంపెనీలు, 250 ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయని తెలిపారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీలో 13.5 లక్షల మంది ఇంజనీర్లు ఉంటే, ఒక్క బెంగళూరులోనే 26 లక్షల మంది ఉన్నారని, ఇదే బెంగళూరు బలమని అన్నారు. బెంగళూరు తనకు సర్వస్వం ఇచ్చిందని, నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

# రాజధాని అమరావతికి చట్టబద్ధత

తీసుకుంది. ఆ తర్వాత ఆ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న వేళ ఈ సమావేశాల్లోనే రాజధాని అమరావతిగా ఆమోదం కల్పించే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా రాజధాని అమరావతి చరిత్రను రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని మంత్రులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.అదే సమయంలో గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం అనుమతులు కల్పించింది.

ఈ క్రమంలోనే ఏపీ కేబినెట్ మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టులను ఏర్పాటు చేసేందుకు ఆమోదం ఇచ్చింది. ప్రాధాన్య క్రమంలో వడ్డెర సంఘాలకు ఖనిజాల లీజుల కేటాయింపులకు ఆమోదం కల్పించారు. ఖనిజాలకు సంబంధించిన లీజుల కేటాయింపులో ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించే నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.చిత్తూరు జిల్లా కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్సు, రికార్డు అసిస్టెంట్ వంటి పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీని మాఫీ చేయాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునికీకరణ మరమ్మతులకు ఏపీ కేబినెట్ పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. రాష్ట్రంలో పలు సంస్థలకు భూమి కేటాయింపులకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ వ్యవస్థపై కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి ఏప్రిల్ 14వ తేదీ లోపు రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో 2000 చొప్పున సూర్యఘర్ కనెక్షన్లను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అదే సమయంలో పీఎం కుసుమ్ పథకం ద్వారా పవర్ లాస్‌లు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 33/11కేవీ సబ్ స్టేషన్‌ల వద్ద బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. టెక్నాలజీని అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు సంస్కరణలను తీసుకొచ్చి విద్యుత్ శాఖ ముందుకెళ్లాలని సూచించారు.

# అసెంబ్లీని నడపలేక ప్రభుత్వం క్రీడాపోటీల ఎత్తుగడ వేసింది

పద్దులపై చర్చలు కొనసాగుతుండగా ఆటల పోటీలు ఎందుకని ప్రశ్నించారు. ఇదే అంశాన్ని తాను అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లానని, కానీ ఆయన వద్ద సమాధానం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రజాసమస్యలపై బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కీలకమైన అంశాలపై చర్చలు జరగాల్సిన సమయంలో ప్రజాప్రతినిధులు మైదానాలలో ఆటలు ఆడుతుంటే ప్రజలు ఏమనుకుంటారని ప్రశ్నించారు.

ఈ నెల 28, 29 తేదీల్లో ప్రభుత్వం క్రీడాపోటీలను నిర్వహించాలని నిర్ణయించిందని, కీలక అంశాలపై చర్చ సమయంలో ఇది సరికాదని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ సమావేశాలను ఆటలపోటీల వంటి కార్యక్రమాల పేరుతో వృథా చేయడమేమిటని ఆవేదన వ్యక్తం చేశారు. పద్దులపై చర్చకు సమయం కేటాయించకుండా సభా సమయాన్ని క్రీడలకు కేటాయించడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు.

# ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం

న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మరియు అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఈ ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా ఇరాన్ నాయకత్వం వెంటనే స్పందించాలని, లేదంటే ఊహించని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. పశ్చిమాసియాలో మండుతున్న యుద్ధజ్వాలల మధ్య డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఇరాన్ ప్రభుత్వానికి ఒక బలమైన హెచ్చరిక జారీ చేశారు. వెంటనే సీరియస్‌గా స్పందించండి అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ స్థాయిలో సంచలనం రేపుతున్నాయి. ఇరాన్ చర్చల విషయంలో జాప్యం చేస్తోందని, ఒకవేళ సమయం మించిపోతే తాము తీసుకోవబోయే చర్యల నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు నటిస్తూనే, మరోవైపు కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.ఈ క్రమంలోనే ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌కు 15 పాయింట్ల శాంతి ప్రణాళికను పంపినట్లు సమాచారం. ఇందులో భాగంగా హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచి అంతర్జాతీయ నౌకలకు రక్షణ కల్పించడం, అణ్వాయుధ కార్యక్రమాలను శాశ్వతంగా పక్కన పెట్టడం వంటి కఠిన నిబంధనలు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలకు ఇరాన్ అంగీకరించకపోతే, ఆ దేశంలోని అతిపెద్ద విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఇప్పటికే ఈ దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన ఆయన, ఈ లోపు ఇరాన్ ఒక నిర్ణయానికి రావాలని గడువు విధించారు. మరోవైపు, ఇరాన్ నావికాదళ కమాండర్ అలీరెజా తంగ్‌సిరి మరణం తర్వాత యుద్ధం మరింత ముదిరినట్లు కనిపిస్తోంది. ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను యుద్ధానికి సిద్ధం చేయగా, అమెరికా కూడా తన మెరైన్ దళాలను ,శక్తివంతమైన యుద్ధ నౌకలను పర్షియన్ గల్ఫ్ వైపు మళ్లిస్తోంది. ఇరాన్ చర్చల ప్రతినిధులు వింతగా వ్యవహరిస్తున్నారని, బయటకు చర్చలు లేవని చెబుతున్నా లోలోపల మాత్రం సంధి కోసం అడుగుతున్నారని ట్రంప్ ఎద్దేవా చేశారు. ఒకవేళ శాంతి ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై నరకాన్ని చూపిస్తామని వైట్ హౌస్ వర్గాలు తీవ్రంగా హెచ్చరించాయి.ఆర్థికంగా చూస్తే, ఈ అనిశ్చితి వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. హార్ముజ్ జలసంధిని ఇరాన్ పాక్షికంగా మూసివేయడం వల్ల ప్రపంచ ఇంధన సరఫరా గొలుసు దెబ్బతింటోంది. ఈ పరిస్థితుల్లో భారత్ వంటి మిత్రదేశాలతో కూడా ట్రంప్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా, అంటే ఏప్రిల్ నెలాఖరుకల్లా ముగించాలన్నది ట్రంప్ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఇరాన్ మాత్రం తాము ఎవరికీ లొంగిపోయే ప్రసక్తే లేదని, తమ నిబంధనల ప్రకారమే శాంతి ఉంటుందని భీష్మిస్తోంది. ఈ పరిణామాలు రాబోయే కొద్ది రోజుల్లో పశ్చిమాసియా భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## ఒకే గొడుగు కిందకు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలు

శ్రీనివాస్‌రెడ్డి తాజాగా స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రయోగాత్మకంగా 5 మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. నారాయణపేట జిల్లాలోని కోస్గి మండలం రంగారెడ్డి జిల్లాలోని అమన్‌గల్ మండలం సంగారెడ్డి జిల్లాలోని వట్‌పల్లి మండలం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ సేవలు అందించనున్నట్లు మంత్రి పొంగులేటి తేల్చి చెప్పారు.తాజాగా సెక్రటేరియట్‌లో రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్‌తోపాటు ఎన్ఐసీ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష చేశారు. ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను తయారు చేసినట్లు తెలిపారు. భూములకు సంబంధించి రెవెన్యూ, సర్వే, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లను ఒకే గొడుగు కిందికి తెచ్చేందుకు ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ తీసుకువచ్చినట్లు వెల్లడించారు. భూ లావాదేవీల వివరాలు పూర్తిగా కనిపించే పారదర్శక వ్యవస్థగా ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్‌ను మంత్రి పొంగులేటి అభివర్ణించారు. భూమికి సంబంధించి ప్రతీ ఒక్క సర్వే నెంబర్‌కు మనుషులకు ఆధార్ నెంబర్ లాగానే భూములకు భూదార్ నెంబర్‌లను కేటాయించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాప్ జతచేయడం ఈ 5 మండలాల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతంగా అమలు చేసిన తర్వాత ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతులకు సులభంగా సేవలు అందించడం భూ వివాదాలకు పరిష్కారం చూపించే దిశగా ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ఒక కీలక అడుగు అని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది.

# నిల్వలు ఉన్నా ఇంధన సెగ

జరగడం లేదని చెబుతున్నారు. అయితే ముందుగానే డబ్బులు చెల్లించాలని మార్చిన నిబంధనల వల్ల కూడా.. పెట్రోల్ బంకులకు తగినంత ఇంధనం అందడం లేదనిచెబుతున్నారు.

### యుద్ధం కారణంగా పానిక్ బయింగ్

కొరత ఉందన్న చిన్నపాటి వదంతులు సోషల్ మీడియాలో వ్యాపించగానే, వాహనదారులు తమ అవసరానికి మించి ఇంధనాన్ని నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సాధారణంగా రోజూ 5 వేల లీటర్లు అమ్ముడయ్యే బంకులో, ఒకేసారి 15 వేల లీటర్ల డిమాండ్ రావడం వల్ల నిల్వలు త్వరగా అయిపోతున్నాయి. ఇదే క్రమంలో కొంతమంది బంకు నిర్వాహకులు ధరలు పెరుగుతాయన్న ఆశతో లేదా ముందస్తు జాగ్రత్తగా స్టాక్ ఉన్నా లేదని చెబుతూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి.

### పర్యవేక్షణ లోపం

నిల్వలు ఉన్నాయని ప్రకటనలు ఇవ్వడానికే పరిమితమైన ప్రభుత్వ యంత్రాంగం, క్షేత్రస్థాయిలో తనిఖీలను విస్మరించిందన్న విమర్శలు వస్తున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు బంకుల్లోని నిల్వలను తనిఖీ చేసి, స్టాక్ ఉండి కూడా అమ్మని వారిపై చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. డిపోల వద్ద ట్యాంకర్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేసేలా చమురు కంపెనీలతో సమన్వయం చేసుకోవడంలో విఫలమవ్వడం వల్లే ఈ అనిశ్చితి కొనసాగుతోంది.

### పరిష్కార మార్గం

ప్రస్తుత సంక్షోభం తొలగాలంటే కేవలం ప్రకటనలు సరిపోవు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపి, ప్రతి బంకులో ఉన్న నిల్వలపై పారదర్శకత తీసుకురావాలి. ట్యాంకర్ల రవాణాను యుద్ధ ప్రాతిపదికన క్రమబద్ధీకరించి, రాత్రిపూట కూడా లోడింగ్ జరిగేలా చూడాలి. ప్రజల్లో ధైర్యం నింపేలా ప్రతి బంకు వద్ద అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను డిజిటల్ బోర్డుల ద్వారా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

# అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు

ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడంతో రోడ్లపైనా ట్రాఫిక్ భారీగా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ సర్కార్ ఎంఎంటీఎస్ సేవలను నగరవాసులకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది.ఈ నేపథ్యంలోనే తాజాగా ఎంఎంటీఎస్ సర్వీసులకు సంబంధించి శాసనమండలి హాల్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలను తీర్చే విధంగా ఎంఎంటీఎస్ సర్వీసులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రతీ సంవత్సరం ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య తగ్గుముఖం పట్టడంపైనా సీఎం ఆరా తీశారు. హైదరాబాద్ నగరంలో ఆఫీస్ వేళల్లో ఎంఎంటీఎస్ సర్వీసుల సంఖ్యను పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

అదే సమయంలో ఎంఎంటీఎస్ రైళ్లు క్రమం తప్పకుండా నిత్యం సమయ పాలన పాటిస్తూ సర్వీసులను నడపాలని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. అదే సమయంలో ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు నేరుగా చేరుకునేందుకు టీజీఎస్‌ఆర్టీసీ బస్సులకు అవకాశం లేకపోవడం ఆయా రైల్వే స్టేషన్లు మెయిన్ రోడ్డు నుంచి లోపలికి ఉన్నందున అక్కడి వరకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని కూడా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని ముఖ్యమంత్రి తెలిపారు. రైళ్లలో, రైల్వే స్టేషన్లలో మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ రైళ్ల వైపు మొగ్గు చూపుతారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. సొంతంగా ఆదాయ వనరులను పెంచుకునేందుకు ప్రయత్నించాలని సంబంధిత అధికారులకు సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు, వసతులు మెరుగు పరిచేందుకు ఉన్న అన్ని అవకాశాలపై అధ్యయనం చేసి రిపోర్టు సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఇక తాజాగా సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, హెచ్‌యూఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ హాజరయ్యారు.

## ఈజ్ ఆఫ్ లివింగ్‌లో

# భాగ్యనగరానికి అగ్రస్థానం

అనుకూలమైన నగరం'గా అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ సంస్థ అన్‌బాక్సింగ్ బీఎల్ఆర్ తాజాగా విడుదల చేసిన 'వీ ఆర్ సిటీ 2026' నివేదికలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. దేశంలోని ఎనిమిది ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ అన్ని రంగాల్లోనూ సత్తా చాటింది. పటిష్టమైన రియల్ ఎస్టేట్ మార్కెట్, సామాన్యుడికి అందుబాటులో ఉన్న రవాణా సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఇలా పలు ప్రత్యేకతలు హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయి. ఒకప్పుడు బెంగళూరు మాత్రమే ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది, కానీ ఇప్పుడు బెంగళూరు ఆధిపత్యానికి హైదరాబాద్ సవాల్ విసురుతోంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్, ఉద్యోగ కల్పనలో హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.ఈ నివేదిక ప్రకారం హైదరాబాద్, బెంగళూరు నగరాలు కలిసి దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జనాభా పరంగా ముంబై, ఢిల్లీ ఎంతో పెద్దవైనప్పటికీ ఆర్థిక వృద్ధిలో మాత్రం ఈ రెండు నగరాలు వాటిని మించిపోతున్నాయి. పదేళ్ల క్రితం దేశంలోని టాప్-8 నగరాల్లో కొత్త కంపెనీల ఏర్పాటులో ఈ రెండు నగరాల వాటా 15 శాతం ఉండగా గత ఆర్థిక సంవత్సరం నాటికి అది 25 శాతానికి పెరిగింది. కార్యాలయాల విస్తరణ, గృహ రుణాల మంజూరు, విమాన ప్రయాణాలు, విద్యార్థుల చదువు వంటి అంశాల్లో ఈ రెండు నగరాలు అగ్రగామిగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా దేశంలోని అత్యంత ధనిక జిల్లాల్లో ఒకటిగా నిలిచింది. ఆఫీస్ స్పేస్ అద్దె విషయానికి వస్తే బెంగళూరుకు హైదరాబాద్ కేవలం 15 శాతం దూరంలోనే ఉంది. కొత్త కంపెనీల ఏర్పాటులో బెంగళూరుతో హైదరాబాద్ సమంగా నిలవడం విశేషం. అయితే ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్లు, సోషల్ ఈవెంట్స్, వినోదంపై పెట్టే ఖర్చుల విషయంలో బెంగళూరు నగరవాసులు ముందుండగా హైదరాబాద్ ప్రజలు గృహ నిర్మాణం వంటి సంప్రదాయ పెట్టుబడులకే ప్రాధాన్యత ఇస్తున్నారు.అభివృద్ధి ఎంత ఉన్నా రవాణా విషయంలో రెండు నగరాలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని ఆ రిపోర్టు వెల్లడించింది. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ విపరీతంగా ఉంది. హైదరాబాద్‌లోనూ ఐటీ కారిడార్లలో ఆఫీసులకు వెళ్లే వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. బెంగళూరు కంటే హైదరాబాద్‌లో వాహనాల వేగం 20 శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రయాణ సమయం మాత్రం దాదాపు సమానంగా ఉండటం గమనార్హం. ఈ రిపోర్టు ప్రకారం మౌలిక సదుపాయాలు, జీవన ప్రమాణాల మెరుగుదలతో హైదరాబాద్ ఇప్పుడు దేశానికే తలమానికంగా, బెస్ట్ సిటీగా నిలిచింది.

# మార్కాపురంలో ఘోర బస్సు ప్రమాదం

జరపగా స్టీరింగ్ స్ట్రక్ అయినట్లు చెప్పినట్లు సమాచారం. కానీ ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన బస్సు క్లీనర్ మహేంద్ర వాదన మాత్రం మరో రకంగా ఉంది. బస్సు ప్రమాదం నుంచి మొట్టమొదటగా తానే ప్రాణాలతో బయటపడినట్లు తెలిపాడు. తాను నిద్రపోతున్న సమయంలో ప్రమాదం జరిగిందని లేచి చూసేసరికి బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుందని పేర్కొన్నాడు. మంటలను ఆర్పే సిలిండర్లు బస్సులో ఉన్నాయని కానీ దట్టమైన పొగ కారణంగా అవి కనిపించలేదని వివరించాడు. చాలా మంది అద్దాలు పగలగొట్టి బయటపడి ప్రాణాలు రక్షించుకున్నారని తెలిపాడు. బస్సు కండీషన్ బాగానే ఉందని క్లీనర్ మహేంద్ర చెప్పాడు. మరోవైపు ఈ మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. ఈ ఘటనలో చనిపోయిన వారికి ఏపీ కేబినెట్ సంతాపం తెలియజేసింది. అదే సమయంలో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. ఇక ఈ ఘోర ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షలు గాయాల పాలైన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. బాధితులకు మెరుగైన ట్రీట్‌మెంట్ అందించాలని ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బస్సు ప్రమాదంపై సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు ప్రమాదం తీరుపై ప్రాథమిక సమాచారాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు అనిత, జనార్దన్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.మరోవైపు ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. బస్సు మంటల్లో కాలి బూడిదై అందులో ప్రయాణికులు సజీవ దహనం కావడం అత్యంత విషాదమని మోదీ పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో ఉన్న వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇక మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మార్కాపురం బస్సు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ బస్సు ప్రమాద ఘటనపై ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. ప్రమాదానికి గురైన బస్సు జగిత్యాల నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఇక్కడి ప్రయాణికులు ఎవరైనా ఉన్నారా అనే వివరాలు తెలుసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఏపీ సీఎస్‌తో తెలంగాణ సీఎస్ మాట్లాడారు.

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌లతో

# జీవితాలకు వెలుగు

**రాయచోటి,** ఉద్యమం రిజిస్ట్రేషన్ వర్క్ షాప్ తో చిరు వ్యాపారుల్లో వెలుగు నింపుతోందని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి నాగార్జున పేర్కొన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోని సంబేపల్లి వెలుగు కార్యాలయంలో యువ పారిశ్రామికవేత్తలకు వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ కార్యాలయం స్త్రీ శక్తి భవన్ నందు ఏ. పి.ఎమ్. ఎస్.ఎమ్. ఇ. మరియు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్ షాప్ కు మంచి స్పందన లభించిందన నిర్వాహకులు పరిశ్రమల ప్రోత్సాహిక అధికారి తెలిపారు. ఉత్పత్తి, సేవా మరియు వ్యాపార పరిశ్రమల రంగాలలో వారికి అవసరమైన ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పై అవగాహన కలిగించి ఈ రోజు ఉచితంగా ఆన్లైన్ చేసామన్నారు. మంచి వ్యాపార ప్రణాళికలతో అవగాహనతో ముద్ర, పి.ఎమ్. ఇ జి.పి. పి ఎం ఎఫ్ ఎం ఈ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. వెలుగు ఏ.పి.ఎం. రెడ్డప్ప మాట్లాడుతూ ఆహార ఉత్పత్తి రంగంలో సబ్సిడీ లభిస్తుందని ముద్ర, పి.ఎం.ఈ.జి.పి., ఫుడ్ ప్రాసెసింగ్ పథకాల ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ప్రతి మహిళ ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి లు కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యనిమేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌లతో జీవితాలకు వెలుగు

**రాయచోటి,** ఉద్యమం రిజిస్ట్రేషన్ వర్క్ షాప్ తో చిరు వ్యాపారుల్లో వెలుగు నింపుతోందని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి నాగార్జున పేర్కొన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోని సంబేపల్లి వెలుగు కార్యాలయంలో యువ పారిశ్రామికవేత్తలకు వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ కార్యాలయం స్త్రీ శక్తి భవన్ నందు ఏ. పి.ఎమ్. ఎస్.ఎమ్. ఇ. మరియు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్ షాప్ కు మంచి స్పందన లభించిందన నిర్వాహకులు పరిశ్రమల ప్రోత్సాహిక అధికారి తెలిపారు. ఉత్పత్తి, సేవా మరియు వ్యాపార పరిశ్రమల రంగాలలో వారికి అవసరమైన ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పై అవగాహన కలిగించి ఈ రోజు ఉచితంగా ఆన్లైన్ చేసామన్నారు. మంచి వ్యాపార ప్రణాళికలతో అవగాహనతో ముద్ర, పి.ఎమ్. ఇ జి.పి. పి ఎం ఎఫ్ ఎం ఈ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా బ్యాంకు రుణాలు పొంది వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. వెలుగు ఏ.పి.ఎం. రెడ్డప్ప మాట్లాడుతూ ఆహార ఉత్పత్తి రంగంలో సబ్సిడీ లభిస్తుందని ముద్ర, పి.ఎం.ఈ.జి.పి., ఫుడ్ ప్రాసెసింగ్ పథకాల ద్వారా మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ప్రతి మహిళ ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి లు కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యనిమేటర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# ఇంకా ఎన్నాళ్లు...అసమానతలు

**హైదరాబాద్,** ప్రాంతీయ అసమానతల పేరుతో ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రాంతీయ అసమానతల పేరుతో దేశాన్ని విభజించాలని చూస్తున్నారా అని మండిపడ్డారు. దేశభక్తి, జాతీయవాదం మీలో మచ్చుకైనా కనిపిస్తోందా అని ప్రశ్నించారు.తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే ఆందోళన వారిలో మొదలైనట్లుగా ఉందని అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా పారడం లేదని ఎద్దేవా చేశారు. అందుకే దక్షిణాదికి అన్యాయం అంటూ కాంగ్రెస్ వారు కొత్త డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి మహిళలంటే ద్వేషమని బండి సంజయ్ ఆరోపించారు. అందుకే దేశాన్ని సుదీర్ఘంగా పాలించిన కాంగ్రెస్ మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని అన్నారు. మహిళలకు 33 శాతం సీట్లు ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వచ్చిన నష్టమేమిటని ప్రశ్నించారు.

# సీఈఐఆర్ టెక్నాలజీతో మొబైల్ ట్రేస్
# - బాధితునికి అందజేత

**- గంభీరావుపేట ఎస్సై : అనిల్ కుమార్**



గంభీరావుపేట (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం, దోస్లాగూడెం గ్రామానికి చెందిన మద్దాలి అనిల్ కుమార్ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను (సీఈఐఆర్)సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించి తిరిగి అందజేయడం సంతోషకరమని సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అలాగే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కూడా ఫోన్ బ్లాక్ చేయించుకోవచ్చని సూచించారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి పోగొట్టుకున్న మొబైల్‌లను ట్రేస్ చేసి తిరిగి అందజేయడానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత వివరాలు, ముఖ్యమైన డేటా రక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

# పరిశ్రమల రాకతో కుప్పానికి
# మహర్ధశ: నారా భువనేశ్వరి

**ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ పదిలం**

**దేశంలోనే మొదటిసారి మహిళలకు ఆస్తిలో సమానహక్కు**

**ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన**

**సమగ్ర ప్రణాళికతో ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం**

**పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో కుప్పానికి మహర్ధశ**

**3వ రోజ కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి**



కుప్పం (ప్రశ్న న్యూస్ )పరిశ్రమల రాకతో కుప్పానికి మహర్దశ పట్టబోతోందని, అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ధిష్ట ప్రణాళికలు రూపొందించారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా 3వ రోజు భువనేశ్వరి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా శాంతిపురం మండలం శివ పురంలోని నివాసంలో స్థానిక నేతలతో నారా భువనేశ్వరి బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం శాంతిపురంలో అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐటీడీపీ కార్యకర్త రవి కుటుంబసభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు. రామకుప్పం,మణేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించారు. రామకుప్పంలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం రామకుప్పం మండలం బల్ల గ్రామంలో మహిళలతో నారా భువనేశ్వరి సమావేశమయ్యారు.

అనంతరం రామకుప్పంలో టీడీపీ కార్యకర్త ముజాహిద్ ఇంటికి వెళ్లి కుటుంసభ్యులతో మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి రామకుప్పం మండలం గోవిందపల్లి గ్రామానికి వెళ్లిన నారా భువనేశ్వరి ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్త ఆనంద్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

**ఎన్టీఆర్ హయాంలో మహిళాభ్యున్నతికి బాటలు**

కుప్పం నియోజకవర్గం రామకుప్పంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. దీంతో కిలోమీటరు మేర వారితో పాటే భువనేశ్వరి కలిసి నడిచారు. విగ్రహావిష్కరణ అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం స్థాపించారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారు.

# ప్రజల అసౌకర్యానికి కారకులు ఎవరు?

**లారీల దుమ్ము ధూళితో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు**

**అధికారులకు ఈ ప్రజల సమస్య కనబడలేదా?**

**శ్వాస కోస వ్యాధులతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని డివిజన్ పరిధిలోని నేషనల్ హైవే పైన లారీల రాకపోకలతో చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న ప్రజలకు శ్వాస కోస వ్యాధుల తో దుమ్ముతో ధూళితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇట్టి విషయాలను పట్టించుకునే నాధులు కరువైనారూ. ప్రజల సౌకర్యార్థం కోసం రోడ్లు వేస్తే భారీ లోడుతో రోడ్లమీద ప్రయాణిస్తూ చిన్న పిల్లలు రోడ్డుమీదికి పోవాలంటే భయపడుతున్నారు. అట్లాగనే అనేక వ్యాధులు సంభవించి జీవన ప్రమాణాల రేటు తగ్గిపోయి అనేక వ్యాధుల బారినపడి వారి ఆయుష్ ఆయు ప్రమాణాలను తగ్గించుకుంటున్నారు. మరి దీనికంతటికి కారణం ఎవరు? దీని వెనకాల ఎవరు ఉండి నడిపిస్తున్నారు మరి ప్రజల బాగోగులు పట్టించుకునేవారు లేరా? దుమ్ము బుక్కి దుమ్ము కక్కి ప్రజలు అనేక పనులు చేసుకుంటే వారికి అనారోగ్యం పాలై మంచాన పడితే వారిని చూసే వారే కరువైనారు. కాబట్టి ఇకనుండి అయినా ఈ నేషనల్ హైవే పైన నడిచే లారీలను తక్కువలోడుతో నెమ్మదిగా వెళ్లాలని ఎప్పటికప్పుడు వాటర్ కొట్టాలని ప్రజలకు ఇబ్బంది కలిగించే పని చేయకూడదని ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. అధికారులు పట్టించుకోని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొని ఈ లారీల భారీ నుండి ప్రజలను రక్షించాలని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి ఆయురు ఆరోగ్యాలను కూడా దృష్టిలో ఉంచుకొని ఇకనుండి అయినా ఈ సమస్యను అరికట్టి చుట్టుపక్కల గ్రామాలకు న్యాయం జరిగే విధంగా చూడాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఒక గొప్ప వరం

**మాజీ సర్పంచ్ మాధవి శ్రీశైలం**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని గురువారం నాడు తుక్కాపూర్ గ్రామానికి చెందిన ఆయిలీ స్వాతి కి తుక్కాపూర్ మాజీ సర్పంచ్ మాధవి శ్రీశైలం చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ అనేది నిరుపేదలకు ఒక గొప్ప వరమని చికిత్స చేసుకున్న వెంటనే ముఖ్యమంత్రి సహాయక నిధులనుండి నిరుపేదలకు ఖర్చుల నిమిత్తం కోసం ప్రభుత్వం అందిస్తుందని తుక్కాపూర్ మాజీ సర్పంచ్ మాధవి శ్రీశైలం తెలిపారు ఈ సీఎం రిలీఫ్ ఫండ్ ను మంజూరు చేసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ , మరియు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, గ్రంధాల సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి కి తుక్కాపూర్ గ్రామ ప్రజల నుండి వారికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో తుక్కాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిలీ రాములు, వార్డు మెంబర్ నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు సురేష్ శ్రీనివాస్, బిక్షపతి, అరవింద్, విట్టల్, మాజీ వార్డ్ మెంబర్ మంగలి యాదగిరి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మందుబాబులకు షాక్
# రూ.వేలల్లో జరిమానాలు

**- నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తాం.. తస్మాత్ జాగ్రత్త**

**- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ :వీరప్రసాద్**




వేములవాడ (ప్రశ్న న్యూస్ )రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో 112 మంది మందుబాబులు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపరచగా, 86 మందికి రూ.5000 చొప్పున, 26 మందికి రూ.2000 చొప్పున జరిమానాలు విధిస్తూ వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించారు. అనంతరం ఎస్. ఐ రామ్మోహన్, ట్రాఫిక్ ఎస్.ఐ రాజు ఆధ్వర్యంలో వారికి కౌన్సిలింగ్ నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా సి.ఐ వీరప్రసాద్ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో ఇందిరమ్మ పేరును ప్రస్తావించే అర్హత
# రాకేష్ రెడ్డికి లేదు తక్షణమే క్షమాపణ చెప్పాలి

**డిసిసి కార్యదర్శి భాగ్యరాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) అసెంబ్లీ సభ లో ఇందిరమ్మ పేరు ఎలా మాట్లాడుతారు తమాషా చేస్తున్నారా రాకేష్ రెడ్డి మాటలు రికార్డ్ ల నుండి తొలగించాలి కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రజనకు ప్రవీణ్ కుమార్ డిసిసి కార్యదర్శి బుడ్డ భాగ్యరాజ్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారా గురించి మాట్లాడేటప్పుడు ఇందిరమ్మ పేరు తీస్తారా .మహిళలకు సంబంధించి అవమానకరంగా మాట్లాడారు ఇందిరమ్మ పేరు సారా కి సంబంధించి ప్రస్తావించినందుకు క్షమాపణలు చెప్పాలి ఇందిరమ్మ మా దేవత . వాజపేయి ఇందిరమ్మ ఉక్కు మహిళా అన్నారు దేవత అన్నారు సభ్యుడికి ఇందిరమ్మ పేరు ప్రస్తావించే అర్హత ఉందా జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున కోరుతున్నాం మా నాయకురాలు ఇందిరమ్మ అవమానించే విధంగా మాట్లాడినందుకు క్షమాపణలు చెప్పాలి ఇందిరమ్మ పేద ప్రజల గుండెల్లో ఉంది.మీరు మహిళా సమాజాన్ని అవమానపరిచినట్టు మా ఆదర్శమూర్తి ఇందిరమ్మ ఎన్నో పథకాలకు ఆమె పేరు పెట్టుకున్నాం రాకేష్ రెడ్డి తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిసిసి కార్యదర్శి బుడ్డ భాగ్యరాజ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# తలుపులమ్మ అమ్మవారి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన
# వసతులు కల్పనకు చర్యలు:జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**దేవస్థానం పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతం**

**చేసి నిర్దేశించిన లక్ష్యంలోపు పనులు పూర్తి చేయాలి**



తుని (ప్రశ్న న్యూస్)లోవ గ్రామంలోని తలుపులమ్మ అమ్మవారి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చేపట్టిన పనులు వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తుని మండలం లోవ గ్రామంలో ఉన్న శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం జరుగుతున్న పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయ పరిసరాలను, రోడ్ల పనులు, విశ్రాంతి గదులు, భక్తులు వెళ్లే క్యూ లైన్లు, దర్శన మార్గం తదితర పనును పరిశీలించి, అధికారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ షణ్మోహన్ శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ లోవ గ్రామంలోని తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట తలుపులమ్మ అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి పి. విశ్వనాథరాజు, తుని తహసీల్దార్ జి.వి.ఎస్.ప్రసాద్, ఎంపీడీవో జి.మరిడయ్య ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లవర్ కోసం అమ్మనే చంపేసింది

**హైదరాబాద్,** హైదరాబాద్ నగరంలో పది నెలల క్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ప్రేమకు అడ్డుచెబుతోందన్న కారణంతో కన్నతల్లినే ఓ కూతురు తన ప్రియుడితో కలిసి హత్య చేసి, మృతదేహాన్ని ఇంట్లోనే పూడ్చిపెట్టిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సికింద్రాబాద్ జవహర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్ భరత్నగర్లో ఈ దారుణం చోటుచేసుకుంది. ఓ బైక్ ఆధారంగా పోలీసులు ఈ కేసును ఛేదించారు.వివరాల్లోకి వెళితే... భరత్నగర్కు చెందిన అంజు అనే మహిళ పది నెలల క్రితం అదృశ్యమైంది. దీంతో ఆమె పెద్ద కుమార్తె బొల్లారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పది నెలలుగా దర్యాప్తు చేస్తున్నా కేసు కొలిక్కి రాకపోవడంతో పోలీసులు దీన్ని సవాలుగా తీసుకున్నారు. ఈ క్రమంలో అంజు చిన్న కుమార్తె ఇషిక, ఆమె ప్రియుడు మౌంటీరాజ్పై అనుమానంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు వాడిన బైక్ ఈ కేసులో కీలక ఆధారంగా మారినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో ఇషిక అసలు నిజాన్ని అంగీకరించింది. ఇషిక, మౌంటీరాజ్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారని, సహజీవనం చేయాలని నిర్ణయించుకున్నారని తెలిసింది. అయితే, వీరి ప్రేమ వ్యవహారాన్ని తల్లి అంజు తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రియుడిని వదిలేయాలని కూతురిని మందలించింది.

# జిల్లాలో సరిపడా ఇంధన,
# ఎల్పీజి గ్యాస్ నిలువలు

**- ప్రజలెవరు అసత్య ప్రచారాలను నమ్మవద్దు**

**- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.**

**ములుగు :** ములుగు జిల్లా ప్రజలకు సరిపడా ఇంధన, ఎల్పిజి గ్యాస్ సిలిండర్ల నిలువలు ఉన్నాయని ప్రజలు ఎవరు అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళనకు గురి కావద్దని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌పీజీ వంట గ్యాస్ మరియు పెట్రోల్, డీజిల్ సరఫరాకు సంబంధించి ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని,సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో ఇంధనం, ఎల్‌పీజీ గ్యాస్ ఏజెన్సీల వద్ద సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని, ముందస్తు బుకింగ్స్ కూడా పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇంధన సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా డీలర్లు రీటైల్ యూనిట్లు, సివిల్ సప్లైస్ అధికారులతో సమన్వయం చేయడం జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా కూడా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. ప్రజలెవరు సోషల్ మీడియాలో, ఇతర మాధ్యమాల్లో వచ్చే అసత్య వార్తలను, వదంతులను నమ్మి ఆందోళనకు గురికావద్దని కోరారు. ఇంధనాన్ని గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం మెదక్ కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్ అదనపు ఎస్పీ మహేందర్ ఆర్డీవోలు తాసిల్దార్లు మైనింగ్ ఇరిగేషన్ పంచాయతీ హౌసింగ్ అధికారులతో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ 1 నుండి 100శాతం ఇసుక సరఫరా మన ఇసుక వాహనం ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు

ఇసుక అక్రమంగా ఇసుక రవాణా చేసే వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించేందుకు ఆన్లైన్లో నమోదు చేయించాలన్నారు. పోలీస్ రెవెన్యూ మైనింగ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలన్నారు. తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్లను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తాగిన మత్తులో బస్సు డ్రైవింగ్

**- తప్పిన పెను ప్రమాదం**

**విశాఖపట్నం:** నగరంలోని జగదంబ జంక్షన్ వద్ద బస్ బీభత్సం సృష్టించింది. టికెట్ కట్ చేయడానికి ఆపిన సమయంలో డ్రైవర్ దిగిన వేళ ఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా బస్సు నడపడం ప్రారంభించాడు.

బస్లో ప్రయాణికులు ఉండగానే నియంత్రణ లేకుండా దూసుకెళ్లాడు. దాదాపు కిలోమీటర్ మేర అడ్డంగా వెళ్లి వాహనాలు, వస్తువులను ఢీకొట్టాడు. ఘటనతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కొన్ని వాహనాలు దెబ్బతిన్నప్పటికీ పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. మద్యం తాగిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్, కండక్టర్ను పోలీసులు విచారిస్తున్నారు.

# మహాత్మ జ్యోతి భూ పూలే బిసి బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా తనికి

**సిద్దిపేట** కలెక్టర్ షేర్ పల్లి బందారం గ్రామంలో మహాత్మా జ్యోతి పూలే బీసీ బాలికల మరియు జూనియర్ కళాశాల ను సందర్శించి అన్నం, బెండకాయ కూర, పాలకూర పప్పు, రసం, నెయ్యి, పెరుగు లను పరిశీలించారు.

పాలకూర పప్పు మరి ఇంత పలచగా ఉంటుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో ఇలాగే వండుతారా అని వంట సిబ్బంది పైన మండిపడ్డారు. కూరలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వంట గది, డైనింగ్ హాల్ ఎల్లపుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.గురుకుల ప్రాంగణం కలియ తిరిగారు.

విద్యార్థులకు మరుగుదొడ్లు మైదానంలో ఉన్నాయని రాత్రి వేళల్లో భయపడుతున్నారని వసతి గృహంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రిన్సిపల్ కలెక్టర్ కి తెలపగా సానుకూలంగా స్పందించి ఈడబ్ల్యూఐడిసి అధికారులు వచ్చి దానికి సంబంధించిన ఎస్టిమేట్ వేస్తారని తప్పనిసరిగా నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.విద్యార్థుల క్రమశిక్షణ అలవాట్లు, ప్రవర్తన నియమావళి ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు మానిటర్ చెయ్యాలని చదువు, భోజనం, వసతి విషయం లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు.

## మున్సిపాలిటీ ఆదాయం పెంపు దిశగా

# బహిరంగ వేలం



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన తైబజార్ వసూళ్లు, జాతర గ్రౌండ్‌లోని మున్సిపల్ షాపుల బహిరంగ వేలం ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఈ వేలాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ సంపత్ కుమార్ పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించారు. మొదట తైబజార్ వేలం నిర్వహించగా, మొత్తం 8 మంది పోటీదారులు పాల్గొన్నారు. వీరిలో సామల శివాని అత్యధికంగా రూ. 21,11,632లకు పాట పాడి తైబజార్ హక్కులను సొంతం చేసుకున్నారు. తదుపరి జాతర గ్రౌండ్‌లోని మున్సిపల్ షాపు (షట్టర్) కోసం నిర్వహించిన వేలంలో 5 మంది పాల్గొన్నారు. ఇందులో ఆకారం వినయ్ రూ. 2,34,000లకు షాపును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మున్సిపల్ ఆదాయాన్ని పెంపొందించేందుకు ఈ వేలం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, రెవెన్యూ అధికారి మాలతి సహా ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజ సేవలో విద్యార్థుల పాత్ర ప్రశంసనీయం

**- జాగిర్యాల్ గ్రామ సర్పంచ్ : గడల ప్రసాద్**

**- జగిర్యాల్‌లో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం**




భీంగల్ (ప్రశ్న న్యూస్ ) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలం,జాగిర్యాల్ గ్రామంలో గురువారం భీంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు,వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడల ప్రసాద్ మాట్లాడుతూ, సమాజ సేవ కోసం విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. తమ గ్రామాన్ని సేవా కార్యక్రమాల కోసం ఎంపిక చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గ్రామంలో పరిశుభ్రత, పచ్చదనం పెంపుతో పాటు ప్లాస్టిక్ వినియోగం తగ్గించే దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే హానికారక ప్రభావాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇంచార్జి సుదర్శన్, అధ్యాపక బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

## ముందస్తు పరీక్షలతో ఆరోగ్య రక్షణ

**- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య**

**- విలాసాగర్ గ్రామంలో మొబైల్ ఎక్స్ - రే సేవలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, విలాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మొబైల్ ఎక్స్-రే వాహనం సేవలు అందుబాటులో ఉంచగా, మొత్తం 107 మంది గ్రామస్తులు ఎక్స్-రే పరీక్షలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య మాట్లాడుతూ, గ్రామస్థులకు మెరుగైన వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని అన్నారు. గ్రామ ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని, ఆరోగ్యమే మహాభాగ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. అనిత, విలాసాగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లైంగికదాడి కేసులో నిందితుడికి

# 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**- రూ. లక్ష జరిమానా విధించిన కోర్టు - జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్, మార్చి 26: మహిళలు, చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. తుప్రాన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడిని కోర్టు దోషిగా తేల్చి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు వెల్లడించారు. తుప్రాన్ పీఎస్ పరిధిలోని జండపల్లి గ్రామానికి చెందిన సోమగారి భాస్కర్ (27) బాలికపై లైంగిక దాడి పలుపడినట్లు ఫిర్యాదు అందడంతో అప్పటి ఎస్ఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి సీఐ శ్రీధర్ సమగ్రంగా విచారణ జరిపి సాక్ష్యాధారాలను సేకరించి, పక్కా ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ ప్రాజూూ కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావల్లి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1 లక్ష జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు,జరిమానా మొత్తాన్ని బాధితురాలికి పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించిదని తెలిపారు. కేసు విజయవంతంగా నడిపించడంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య, భారోసా లీగల్ ఆఫీసర్ అడ్వకేట్ కే. స్వేత కీలక పాత్ర పోషించారు. తూప్రాన్ ఎసై గంగరాజు, జిల్లా లైజనింగ్ ఆఫీసర్ బి. విఠల్, పీసీలు జి. కృష్ణ, సీడిఓ నాగరాజు తదితరులు సమన్వయం చేశారు. ఇలాంటి కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## శ్రీరామనవమి వేడుకలకు పటిష్ట భద్రత

## - 300 మంది పోలీసులతో బందోబస్తు

**- లోక్ అధాలత్ కు సిద్ధం - రాజీ కేసుల పరిష్కారం పై దృష్టి**

**- జిల్లా ఎస్పీ : మహేష్ బి. గితే**



వేములవాడ (ప్రశ్న న్యూస్ ) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రాజన్న క్షేత్రంలో నేడు శుక్రవారం జరగనున్న సీతారాముల కళ్యాణోత్సవం, అలాగే జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా 300 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే, 28న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ నేపథ్యంలో రాజీ పడదగిన కేసులను గుర్తించి, కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాస్, సీఐలు శ్రీనివాస్, వీరప్రసాద్, మొగిలి, ఎస్ఐలు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా జనార్ధన్ రెడ్డి ఎన్నిక

**అభినందనలు తెలిపిన న్యాయవాదులు**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా బార్ అసోసిసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా పోటీలో నిలుచున్న లయన్ జనార్ధన్ రెడ్డి కి 71 రాగా, మర్కంటి రాములుకు 14 ఓట్లు రావడంతో జనార్ధన్ రెడ్డి ప్రత్యర్థి అభ్యర్థిపై 57 ఓట్ల మేజార్టీతో గెలుపోందినట్లు ఎన్నికల అధికారి శిరిగె ప్రభాకర్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఎస్. శోభన్ గౌడ్, జనరల్ సెక్రేటరీగా శ్రీపతి రావు, జాయింట్ సెక్రేటరీగా వేణుగోపాల్ చారి, లైబ్రరీ సెక్రేటరీగా ధరావత్ రమేశ్, ట్రెజరర్ నర్సింలు, స్పోర్ట్స్ రవి గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ గా మమత, మంజుల, ఆరీఫ్ హుస్సెన్, కె.ఎన్.ఎన్. దత్, బి. ప్రశాంత్ లు ఎన్నికైనట్లు ఆయన పేర్కోన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా గెలిచిన లయన్ జనార్దన్ రెడ్డికి బార్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

## గిరిజనులకు సమస్యలు వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాము



శ్రీ కాళహస్తి( ప్రశ్న న్యూస్) సత్యవేడు నియోజకవర్గం కేవీబీ పురం మండలం ఎస్సార్ పురం గిరిజన కాలనీ నందు సందర్శించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఏం సుబ్బయ్య గురువారం ఉదయం 11 గంటలకు సత్యవేడు నియోజకవర్గం కె వి బి పురం మండలం ఎస్సార్ గిరిజన కాలనీ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య అక్కడ నివసిస్తున్న యానాదులు 80 కుటుంబాలను సందర్శించి వాళ్లకి ఏవేవి సమస్యలు ఉన్నాయో వాటిని అడిగి మరి తెలుసుకొని ఈ సమస్యలను వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకుని పోయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి మీ సమస్యలను తీసుకుపోయి పరిష్కారం వెంటనే చేస్తామని మీరు ఏవైతే హామీలు అడిగారు ఏవైతే మీరు మాకు కావాలి అని సమస్యలు చెప్పారు వాటిని వెంటనే పరిష్కార దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయి వెంటనే వాటిని పరిష్కరించి గిరిజన కుటుంబాలను ఎం సుబ్బయ్య హామీ ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో సత్తివేడు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు బంగారయ్య గిరిజన నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి అమ్మవార్లు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల అనుబంధ ఆలయమైన ఊరందూరు నీలకంఠేశ్వర స్వామి క్షేత్రానికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి అమ్మవార్లు విచ్చేయడం జరిగింది. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయం వెలుపల స్వామి వారికి ఎదురు సేవగా వెళ్లి, అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారికి స్వాగతం పలికి ఆహ్వానించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ధర్మపత్ని బొజ్జల రిషిత రెడ్డి ఎమ్మెల్యే బొజ్జల తల్లి బృందమ్మ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈరోజు జరిగిన శాంతి అభిషేకం మరియు అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. మన ఊరి గ్రామ దేవతల ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆ పరమశివుని మనస్ఫూర్తిగా ప్రార్థించాను.

## మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసిన

**- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

**- పిల్లలతో కలిసి భోజనం రుచి చూసి, భోజన నాణ్యత, పరిసరాలు పరిశుభ్రతను పరిశీలించిన ఎమ్మెల్యే**



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) జీవీఎంసీ 33వ వార్డ్ పరిధిలో ఉన్న ఎం.జీ.ఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న భోజనం నాణ్యత ,టాయిలెట్ల పరిశుభ్రత పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న భోజనాన్ని పిల్లలతో కలిసి భోజనం రుచి చేశారు .అదేవిధంగా విద్యార్థులతో మాట్లాడి భోజన వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నేరుగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాల సిబ్బంది స్కూల్ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకం విద్యార్థిని, విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తుందని, కూటమి ప్రభుత్వంలో పిల్లల పౌష్టికాహారంతో పాటు శక్తిని చేకూర్చే ఆహారాన్ని అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జనసేన ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ వసంత లక్ష్మి , జీకే , జనసేన వార్డు అధ్యక్షులు రాజు , కూటమి పెద్దలు, సీనియర్ నాయకులు చక్రవర్తి , సత్యనారాయణ , ఆళ్ల శ్రీనివాస్ , ప్రభాకర్ , వెంకట అప్పారావు , స్కూల్ ప్రధానోపాధ్యాయలు, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్, స్కూల్ సిబ్బంది ,అక్షయపాత్ర నిర్వాహకులు, జనసేన పార్టీ సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి ,ఇతర కూటమి శ్రేణులు పాల్గొన్నారు

## అక్రమంగా ఇసుక తరలిస్తే

# కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. గురువారం మెదక్ కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి శాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు తాసిల్దార్లు , మైనింగ్ ,ఇరిగేషన్, పంచాయతీ హౌసింగ్ అధికారులతో కలిసి తో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలోఏప్రిల్ 1 నుండి 100% ఇసుక సరఫరా "మన ఇసుక వాహనం" ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమంగా ఇసుక రవాణా చేసే వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించేందుకు ఆన్లైన్లో నమోదు చేయించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసి అక్రమంగా ఇసుక రవాణాను అడ్డుకోవాలన్నారు. తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్లను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మం, నైతికత, ఆదర్శాల సమ్మేళనమే

# రామతత్త్వ పరమార్థం

## - శ్రీరామరామరామేతి రమేరామే మనోరమ - సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే



భారతీయ సంస్కృతిలో ధర్మానికి ప్రతిరూపం అయిన శ్రీ రామచంద్రుడి జన్మదినమే శ్రీరామనవమి పండుగ. లోకోద్ధరణ కోసం దశరథ నందనుడిగా శ్రీ రామ చంద్రుడు అవతరించిన అతి పవిత్రమైన రోజు. చైత్రశుద్ధ పాడ్యమి (ఉగాది) నుండి ప్రారంభమయ్యే వసంత నవరాత్రులు నవమి నాడు శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవంతో ముగుస్తాయి.

### శ్రీ రాముని ప్రాముఖ్యత

పురాణాల ప్రకారం రామాయణంలో శ్రీ రామునికి వశిష్ట మహర్షి నామకరణం చేశారు. ఇందులో 'రమంతే యోగినో యత్ర రామ' అంటే, యోగీశ్వరులు ఏ దేవుడి నుంచి ఆస్వాదన చెందుతారో వారే రాముడు అని అర్థం. శ్రీరామ నవమి రోజున రామ నామస్మరణ చేయడం వల్ల రెట్టింపు పుణ్య ఫలం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రీరామనవమి రోజే సీతారాముల కళ్యాణం జరిగిందని, పట్టాభిషేకం కూడా ఇదే రోజు జరిగిందని పురాణాలు పేర్కొంటున్నాయి. అందుకని దేశవ్యాప్తంగా నగరాలతో పాటు గ్రామగ్రామాన చలువ పందిర్లు వేసి సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవోపేతంగా నిర్వహిస్తారు. శ్రీరామనవమి నాడు ప్రత్యేక పూజలు చేయడం, కళ్యాణం నిర్వహించడం, రామ మంత్రాలు జపించడం వల్ల విశేషమైన ఫలితం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. అంతేకాకుండా రామ నామాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జపించడం వల్ల అనేక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందని పండితులు చెబుతారు.

### రామనామ జపం

అత్యంత పవిత్రమైన, శక్తివంతమైన తారక మంత్రం. శ్రీరామ రామ రామేతి...అనే శ్లోకం ప్రకారం, రామనామాన్ని ఒకసారి జపిస్తే వేయి విష్ణు నామాలకు (సహస్రనామం) సమానమైన ఫలితాన్ని ఇస్తుందని అర్థం. నిత్యం రామనామం స్మరించడం వల్ల మనశ్శాంతి, ధైర్యం, పాప విముక్తి, జీవితంలో సకల శుభాలు కలుగుతాయని నమ్ముతారు

### రామనామ విశిష్టత

**తారక మంత్రం:** రామ నామం జనన మరణ చక్రం నుండి విముక్తి కలిగిస్తుందని, అందుకే దీనిని తారక మంత్రం అంటారు.

### పాప నివారణి..

"రా" అనే అక్షరం పలికేటప్పుడు పాపాలు బయటకు పోతాయని, "మ" అనే అక్షరం పలికేటప్పుడు పాపాలు లోపలికి రాకుండా ఉంటాయని ఆధ్యాత్మిక వివరణ.

### శక్తివంతమైన మంత్రాలు..

ఓం శ్రీ రామాయ నమః, శ్రీ రామ జయ రామ జయ జయ రామ" వంటి మంత్రాలను రోజుకు 108 సార్లు జపించడంతో అత్యున్నతమైన ఫలితాలు పొందవచ్చు.

### మానసిక ప్రశాంతత..

రామ నామ జపం హృదయానికి ప్రశాంతతను, ఒత్తిడి నుండి ఉపశమనాన్ని ఇస్తుంది. అయితే రామ నామానికి ప్రత్యేక నియమాలు లేవు, భక్తితో ఎప్పుడైన, ఎక్కడైన స్మరించుకోవచ్చని ఆధ్యాత్మికవేత్తలు సూచిస్తున్నారు.

### నేటి తరానికి ఆదర్శం సీతారాముల కళ్యాణం

లోకోద్ధరణ కోసం ప్రతి సంవత్సరం
చైత్ర శుద్ధ నవమి (శ్రీరామనవమి) రోజు మధ్యాహ్నం 12:18 నుండి 12:27 గంటల మధ్య అభిజిత్ లగ్నం, పునర్వసు నక్షత్రంతో కూడిన కర్కాటక లగ్నంలో సీతారాముల కళ్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈ కళ్యాణం కేవలం ఒక పండగ మాత్రమే కాదు. నేటి తరం యువతకు బంధాల పట్ల ఉండాల్సిన నిబద్ధత, అచంచలమైన విశ్వాసాన్ని గుర్తు చేస్తుంది. కష్టాల్లో కుంగిపోకుండా సుఖాల్లో పొంగిపోకుండా క్రమశిక్షణ, ఓర్పు, సహనంతో ముందుకు సాగాలనే జీవిత పరమార్థాన్ని, కుటుంబ విలువల పట్ల ఉండాల్సిన గౌరవాన్ని తెలియజేస్తుంది. అన్నింటికంటే ముఖ్యంగా భాగస్వామి పట్ల పరస్పర గౌరవం, నమ్మకం ఉండాలని సూచిస్తుంది. ఇవన్నీ ఉంటేనే సంసార జీవితం బాగుంటుందని, సంసార జీవితం బాగుంటేనే సమాజంలో గౌరవం దక్కుతుందనే సత్యాన్ని బోధిస్తుంది. అందుకే సీతారామ కల్యాణం చారిత్రాత్మకమైన పవిత్ర వివాహ మహోత్సవం. వాల్మీకి రామాయణం ప్రకారం, అయోధ్య రాకుమారుడు శ్రీరాముడు శివ ధనస్సును విరిచి మిథిలా నగర రాకుమారి సీతాదేవిని వివాహం చేసుకున్నాడు.

### ధర్మస్థాపణకు మార్గదర్శి

రాముని జీవితం కేవలం ఒక పురాణ గాథ మాత్రమే కాదు. ఇది ఒక సంపూర్ణ జీవన విధానం. పితృవ్యాక్య పాలన, ఏక పత్నీవ్రతం, ప్రజారంజక పాలన వంటి ఆదర్శాలతో రామరాజ్య స్థాపన చిరస్థాయిగా నిలిచిపోయి రామున్ని దేవుడిగా మార్చాయి. నేటి సమాజంలో మానవులు నైతిక విలువలు కాపాడుకోవడం కోసం శ్రీ రామచంద్రుడిని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మన ఆధ్యాత్మికవేత్తలు బోధిస్తున్నారు.

### శ్రీరామ పట్టాభిషేకం

రావణ వధ తర్వాత సీతారామలక్ష్మణులు అయోధ్యకు తిరిగి రాగా, వశిష్టాది మహర్షులు, సుగ్రీవ విభీషణాదుల సమక్షంలో రాముడు అయోధ్య రాజ్యాధికారాన్ని స్వీకరించి, ధర్మబద్ధమైన 'రామరాజ్యాన్ని స్థాపించాడని పురాణాలు చెబుతున్నాయి. శ్రీరామ నవమి మరుసటి రోజు దశమి నాడు పట్టాభిషేకం మహోత్సవాన్ని ఘనంగా శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

### ఆచరణీయం రామతత్వం

రామతత్వం అంటే ధర్మం, నైతికత, ఆదర్శాల సమ్మేళనం. శ్రీరాముడు ఆదర్శ పురుషోత్తముడుగా సత్యం, త్యాగం, పితృవాక్య పరిపాలన దయా గుణానికి ప్రతీకగా నిలుస్తాడు. కష్ట కాలంలో ధర్మాన్ని వీడకుండా, ప్రజా శ్రేయస్సును ఆకాంక్షిస్తు, ఆదర్శవంతమైన జీవితాన్ని గడపడమే రామ తత్వం. ఇది మానవాళికి నిత్యం ఆచరణీయమైన మార్గం

### రామ తత్వంలోని ముఖ్య అంశాలు

**ధర్మ స్వరూపం:** రాముడు ధర్మానికి నిలువెత్తు రూపం. తండ్రి మాట కోసం అరణ్యవాసం, సీతా పరిత్యాగం వంటి నిర్ణయాలు వ్యక్తిగత ఆనందం కంటే ధర్మపాలన ముఖ్యమని చెబుతాయి.

### ఆదర్శ మానవుడు..

రాముడు ఆదర్శ కుమారుడిగా, సోదరుడిగా, భర్తగా, పాలకుడిగా రామరాజ్య స్థాపనకు తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాడు.

### సత్యం - త్యాగం..

వ్యక్తిగత ఇష్టాలను, సుఖాలను త్యాగం చేసి, సత్యాన్ని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో రాముడు అగ్రగణ్యుడు.

### సర్వసమభావం..

జాతి, వర్గ బేధాలు లేకుండా అందరినీ సమానంగా ప్రేమించడం, శరణు వేడిన వారిని కాపాడటం రాముని గుణం.

### నిశ్చలమైన చిత్తం..

జీవితంలో ఎదురైన కష్టనష్టాలు, సీతా వియోగం వంటి దుఃఖాలను కూడా రాముడు అత్యంత ధైర్యంతో, సహనంతో భరించాడు. రామ తత్వాన్ని అనుసరించడం అంటే కేవలం పూజించడం కాదు, ఆయన చూపిన సన్మార్గంలో నడుస్తు, జీవితంలోని ప్రతి స్థితిలోను సత్యం, ధర్మాలను పాటించడం ద్వారా శ్రీసీతారామచంద్రుల కృపకు పాత్రులవ్వాలని కోరుతు శ్రీ రామనవమి శుభాకాంక్షలతో



**రవికుమార్ సంతోజా**
**బడంగ్ పేట్, రంగారెడ్డి (జిల్లా)**

---

## మార్చి 27న శ్రీ సీతారామచంద్రస్వామి వార్ల

# కల్యాణోత్సవం



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) ఈ నెల 27న శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థాన అనుబంధ దేవాలయమైన శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సీతారామచంద్రస్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామివారి ఆలయంలో ఉదయం గం. 9.00ల నుండి సీతారాముల వారికి, ఆ తరువాత ఆంజనేయస్వామి వారికి విశేష పూజాదికాలు జరిపించబడుతాయి. తరువాత ఉదయం గం. 9.30 నుండి సీతారాముల కల్యాణోత్సవం జరిపించబడుతుంది. ఈ కల్యాణమహోత్సవంలో ముందుగా లోకసంక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించబడుతుంది. తరువాత కల్యాణోత్సవం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ నిర్వహిస్తారు. అనంతరం వృద్ధి, అభ్యుదయాలను కాంక్షిస్తూ పుణ్యాహవచనం జరిపించబడుతుంది. ఆ తరువాత కంకణపూజ, కంకణధారణ, యజ్ఞోపవీతపూజ, యజ్ఞోపవీతధారణ, నూతన వస్త్ర సమర్పణ, వరపూజ, ప్రవర పఠన, గౌరీపూజ, మాంగల్య పూజ, శ్రీ సీతాదేవివారికి మాంగల్యధారణ, తలంబ్రాలు మొదలైన కార్యక్రమాలతో సంప్రదాయ బద్ధంగా సీతారామ కల్యాణం జరిపించబడుతుంది. కల్యాణోత్సవం తరువాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయబడుతాయి.

## విలేకరి నాగిరెడ్డిని బెదిరింపులు గురి చేసిన ఇట్టా భాస్కర్ పై చర్యలు తీసుకోండి.

**- మంగళగిరి నియోజకవర్గ జర్నలిస్టులు.**





తాడేపల్లి(ప్రశ్న న్యూస్) సాక్షి దినపత్రిక లో గురువారం ప్రచురించిన వార్త విషయంలో,విలేకరి నాగిరెడ్డి కి ఫోన్ చేసి బెదిరించిన టీడీపీ నాయకుడు ఇట్టా భాస్కర్ పై, జర్నలిస్ట్ హక్కుల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తాడేపల్లి ప్రెస్-క్లబ్ అధ్యక్షుడు జొన్న వెంకటేష్ ఆధ్వర్యంలో, మంగళగిరి నియోజకవర్గ జర్నలిస్టులు సిఐ వీరేంద్రబాబు ని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి ప్రెస్-క్లబ్ అధ్యక్షుడు జొన్న వెంకటేష్, మంగళగిరి ప్రెస్-క్లబ్ కార్యదర్శి దయాకర్ లు మాట్లాడుతూ జరిగిన వాస్తవాలను, సంఘటనలను యదార్థం గా ప్రచురిస్తామని, మీడియా కవరేజ్ ఇస్తామని,అది మీడియా స్వేచ్ఛ లో భాగమని అన్నారు.జరిగిన సంఘటన లో బెదిరింపుకు పాల్పడ్డ నాయకుడు పేరు ఎక్కడా ప్రస్తావించక పోయినా, ఇలా విలేకరి కి ఫోన్ చేసి బెదిరించడాన్ని తీవ్రంగా ఖండించారు.జర్నలిస్ట్ హక్కులను కాలరాసే విధంగా ప్రవర్తించిన టీడీపీ నాయకుడు ఇట్టా భాస్కర్ పై , తగు చర్యలు తీసుకోవాలని తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు కి విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు జాయింట్ ఆపరేషన్. నిర్వహించిన: జిల్లా ఎస్పీ

**- టోల్ ప్లాజాల వద్ద విస్తృత వాహన తనిఖీలు భద్రతపై ప్రత్యేక దృష్టి.**

**- పోలీస్, ట్రాన్స్పోర్ట్, అగ్నిమాపక శాఖల సంయుక్త చర్యలు.**



**తిరుపతి (ప్రశ్న న్యూస్)** ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, నేతృత్వంలో పోలీస్ శాఖ, ట్రాన్స్పోర్ట్ అగ్నిమాపక శాఖలు సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. మార్కాపురంలో జరిగిన విషాద ఘటనను దృష్టిలో ఉంచుకొని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చెన్నై--విజయవాడ, తిరుపతి--చెన్నై, తిరుపతి--విజయవాడ జాతీయ రహదారుల ఏర్పేడు టోల్ ప్లాజా, వడమాలపేట టోల్ ప్లాజా ప్రాంతాల్లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, ట్రావెల్స్ బస్సులు సుదూర ప్రయాణ వాహనాలు లక్ష్యంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు.-తనిఖీల సమయంలో అధికారులు వాహన భద్రతా ప్రమాణాలు డ్రైవర్ల పనితీరు అగ్నిమాపక పరికరాలు ఉన్నాయా లేదా, బస్సుల్లో ఏమైనా ప్రమాదకర వస్తువులు ఉన్నాయా, ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే తగిన ఏర్పాట్లు ఉన్నాయా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అవసరమైన సూచనలు ఇచ్చి, ప్రజల భద్రతకు చర్యలు చేపట్టారు. , జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు ఇటువంటి తనిఖీలు నిరంతరం నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, వెల్లడించారు. పోలీస్ శాఖ సూచన: రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి, నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ, ట్రాన్స్పోర్ట్ శాఖ అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు

## వేదమంత్రాల నడుమ ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

**- మార్చి 27న ధ్వజారోహణం**



ఒంటిమిట్ట (ప్రశ్న న్యూస్) ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో నిర్వహించనున్న వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు భక్తి భావపూర్వక వాతావరణంలో వేదమంత్రాల నడుమ గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది.పురాతన చారిత్రక ప్రాశస్త్యాన్ని కలిగిన ఈ ఆలయంలో ఒకే శిలపై శ్రీ సీతారామ లక్ష్మణుల దివ్య మూర్తులు వెలసి



ఉండటంతో ఒంటిమిట్టను "ఏకశిలానగరం"గా కూడా పిలుస్తారు. ఈ పవిత్రక్షేత్రంలో మార్చి 26 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో ముస్తాబైంది.గురువారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చనలను శాస్త్రోక్తంగా చేశారు. సాయంత్రం 6 గంటల నుండి అర్చకుల వేదమంత్రాల నడుమ అంకురార్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలశ ప్రతిష్ఠ, కలశపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ వంటి శాస్త్రోక్త కర్మలను నిర్వహించారు. అనంతరం పుట్టమన్ను సేకరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది.

### మార్చి 27న ధ్వజారోహణం

శుక్రవారం ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. దీంతో శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి.అనంతరం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీరామనవమి ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు పోతన జయంతి కార్యక్రమం, కవి సమ్మేళనం జరుగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవను భక్తులు వీక్షించనున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎ. ప్రశాంతి, ఏఈవో బాలరాజు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## కనిపించని సమన్వయం

**విశాఖపట్టణం,** తెలుగుదేశం పార్టీ ఈసారి కూడా సర్వే నివేదికల ఆధారంగానే టిక్కెట్లను ఖరారు చేయనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలు 263కు పెరుగుతుండటంతో కనీసం రెండు వందల స్థానాలకు కాస్త అటు ఇటుగా టీడీపీ పోటీ చేసే అవకాశముంది. అయితే ప్రస్తుతమున్న అనుభవంతో ఈసారి మాత్రం పార్టీ విధేయులకు పట్టం కట్టాలని యోచిస్తున్నారని తెలిసింది. గత ఎన్నికల్లో యువకులు, సామాజికవర్గంతో పాటు, వారి ఆర్థిక స్థితిని చూసి టిక్కెట్లను కేటాయించారు. అయితే అది చాలా వికటించింది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు 2024 ఎన్నికల్లో గెలిచి గాడి తప్పుతున్నారు.వేసిన అంచనాలకు వారి పనితీరుకు మధ్య పొంతన లేకుండా పోయింది. సీనియర్ నేతలను పక్కన పెట్టి కొంత తప్పు చేశామని ఇప్పుడు పార్టీ నాయకత్వం పునరాలోచనలో పడింది. కొత్తగా వచ్చిన నేతలకు పార్టీ పట్ల కమిట్ మెంట్ లేకపోవడంతో పాటు క్యాడర్ ను దగ్గరకు తీసుకోకపోవడంతో పాటు తమ వ్యాపారాల పైనే ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు స్పష్టంగా తమకు అందుతున్న వివిధ సంస్థలు, నిఘా నివేదికల ద్వారా అందుతున్నాయి.ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోవాలని చంద్రబాబు పదే పదే చెబుతున్నారు.

## విడాకులు తీసుకోబోతున్నట్టు

# వస్తున్న వార్తలపై

## ప్రియాంక చోప్రా స్పందన!



అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా, తన వైవాహిక జీవితంపై సాగుతున్న నెగటివ్ ప్రచారానికి ముగింపు పలికారు. నిక్ జోనాస్‌తో ఆమె విడిపోతున్నారంటూ వస్తున్న వార్తలను ఆమె కొట్టిపడేశారు. ఈ వార్తలు కేవలం కల్పితమని... దేశం, మతం, వయసు వంటి అంశాలను సాకుగా చూపి కొందరు విషప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. కేవలం ఆరు నెలల పరిచయంతోనే పెళ్లి చేసుకున్నప్పటికీ, తమ మధ్య ఉన్న గౌరవం, నిక్ చూపే నిజాయతీ ఈ ఎనిమిదేళ్ల ప్రయాణాన్ని ఎంతో మధురంగా మార్చాయని ప్రియాంక తెలిపారు. బయటి వ్యక్తుల అభిప్రాయాలు తమ బంధాన్ని ప్రభావితం చేయవని తేల్చి చెప్పారు. తన కుమార్తె మాల్తీ మేరీ ప్రైవసీ విషయంలో తాను చాలా కఠినంగా ఉంటానని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ఫొటోలు తీయడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడం వంటివి తనకు నచ్చవని, అందుకే తన బిడ్డ భద్రత కోసం ప్రత్యేక సెక్యూరిటీని ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. 30 ఏళ్ల వయసులో బాలీవుడ్‌లో టాప్ పొజిషన్‌లో ఉండి కూడా, అన్నీ వదిలేసి హాలీవుడ్‌లో సున్నా నుంచి మొదలుపెట్టడం ఒక పెద్ద సాహసమని ఆమె గుర్తు చేసుకున్నారు. మొదట్లో చిన్న పాత్రలే వచ్చినప్పటికీ, పట్టుదలతో ముందుకు సాగానని... ఇప్పుడు తనకు నచ్చిన ప్రాజెక్టులను ఎంచుకునే స్థాయికి చేరుకున్నానని గర్వంగా చెప్పారు.

## ‘ధురంధర్2’ దెబ్బకు

# ‘పుష్ప2’ రికార్డులు గల్లంతు



రణ్‌వీర్ సింగ్ నటించిన ‘ధురంధర్ 2’ బాక్సాఫీస్ వద్ద సంచలన రికార్డులు సృష్టిస్తోంది. సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ స్పై యాక్షన్ డ్రామా, విడుదలైన ఏడో రోజే సరికొత్త చరిత్ర సృష్టించి, ట్రేడ్ వర్గాలను విస్మయపరిచింది. కేవలం హిందీ వెర్షన్‌లో బుధవారం ఒక్కరోజే దాదాపు 47 కోట్ల రూపాయల వసూళ్లు సాధించి, మొదటి బుధవారం అత్యధిక కలెక్షన్లు రాబట్టిన ఇండియన్ సినిమాగా రికార్డులకెక్కింది. గతంలో ఏ హిందీ సినిమా కూడా ఈ స్థాయి ప్రభంజనాన్ని సృష్టించలేదు. పాత రికార్డులన్నీ తుడిచిపెట్టుకుపోయాయి ‘ధురంధర్’ స్పీడ్‌కు బాక్సాఫీస్ రికార్డుల సమీకరణాలు మారిపోతున్నాయి. ఇప్పటివరకు మొదటి బుధవారం అత్యధిక వసూళ్లలో అగ్రస్థానంలో ఉన్న విక్కీ కౌశల్ హిస్టారికల్ మూవీ ‘ఛావా’ (రూ.32.40 కోట్లు) ఇప్పుడు రెండో స్థానానికి పడిపోయింది. అలాగే, సన్నీ డియోల్ నటించిన ‘గదర్ 2’ (రూ.32.37 కోట్లు) మూడో స్థానానికి పరిమితమైంది. రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్, ఆదిత్య ధర్ టేకింగ్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తుండటంతో పాత రికార్డులన్నీ తుడిచి పెట్టుకుపోతున్నాయి. అన్నింటికన్నా అతి పెద్ద ఆశ్చర్యం అన్నింటికన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ రికార్డుల దెబ్బకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ‘పుష్ప 2’ టాప్-3 నుండి కిందికి పడిపోయింది. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ‘పుష్ప 2: ది రూల్’ హిందీ వెర్షన్ రూ.31.50 కోట్లు వసూలు చేసి మూడో స్థానంలో ఉండేది, కానీ ఇప్పుడు ధురంధర్ 2 ధాటికి నాలుగో స్థానానికి పడిపోయింది. రణ్‌బీర్ కపూర్ నటించిన ‘యానిమల్’ (రూ.30.45 కోట్లు) ఈ జాబితాలో ఐదో స్థానంలో కొనసాగుతోంది. పుష్ప వంటి భారీ పాన్-ఇండియా సినిమా రికార్డునే రణ్‌వీర్ సింగ్ బ్రేక్ చేయడం ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మొత్తానికి, ‘ధురంధర్ 2’ కేవలం ఒక స్పై థ్రిల్లర్‌గానే కాకుండా బాక్సాఫీస్ వద్ద ఒక కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఈ సినిమా సాధిస్తున్న కలెక్షన్ల లెక్కలు చూస్తుంటే, రాబోయే రోజుల్లో మరిన్ని భారీ రికార్డులను తిరగరాయడం ఖాయమనిపిస్తోంది. లాంగ్ రన్‌లో ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.


## నవ్వులు పూయిస్తూనే

# భయపెడుతున్న ‘రాకాస’..




‘మ్యాడ్’, ‘మ్యాడ్ స్క్వేర్’ సినిమాలతో యూత్ లో క్రేజ్ సంపాదించుకున్న యంగ్ హీరో సంగీత్ శోభన్ సోలో హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘రాకాస’. జీ స్టూడియోస్ సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్ బుధవారం ఘనంగా విడుదలైంది. మానస శర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమా హారర్, కామెడీ, ఫాంటసీ అంశాల కలయికతో రూపొందింది. అమెరికా నుంచి ఒక కుర్రాడు (సంగీత్ శోభన్) తన ఊరికి తిరిగి వచ్చినప్పుడు, అక్కడి ఒక పాడుబడ్డ కోట వెనుక ఉన్న మిస్టరీలో ఎలా చిక్కుకున్నాడనేది ట్రైలర్‌లో ఆసక్తికరంగా చూపించారు. ఊరు మొత్తం కలిసి ఒక బ్రహ్మరాక్షసుడికి హీరోను బలి ఇవ్వాలని చూడటం, ఆ విపత్కర పరిస్థితుల నుంచి హీరో తన కామెడీ టైమింగ్‌తో ఎలా తప్పించుకున్నాడనేది సినిమాలో ప్రధానాకర్షణగా నిలవనుంది. వెన్నెల కిశోర్, తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ, ఆశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ‘కమిటీ కుర్రాళ్లు’ సినిమాతో నిర్మాతగా మంచి విజయాన్ని అందుకున్న నిహారిక, ఈ ‘రాకాస’తో మరో హిట్ కొట్టాలని భావిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## రామ్‌చరణ్ కంటికి స్వల్ప సర్జరీ



’పెద్ది’ సినిమా షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా రామ్ చరణ్ కంటికి గాయం కావడంతో, మెగా కుటుంబంతో పాటు అభిమానుల్లోనూ కొంత ఆందోళన నెలకొంది. అయితే, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఈ సర్జరీ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా డాక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ సమయంలో తమకు కలిగిన ఆందోళనను డాక్టర్ తన మాటలతో, పనితనంతో పోగొట్టారని ఆయన వివరించారు.డాక్టర్ సుధాకర్ ప్రసాద్ గారు, చరణ్ కంటికి మీరు ఎంతో నైపుణ్యంతో, సకాలంలో సర్జరీ చేసినందుకు ధన్యవాదాలు. తొలుత మాకు కొంత ఆందోళన కలిగినప్పటికీ.. మీరు చెప్పిన మాటలు మా భయాన్ని పోగొట్టి ధైర్యాన్ని ఇచ్చాయి. సకాలంలో స్పందించి చికిత్స అందించినందుకు కృతజ్ఞతలు అని చిరంజీవి పేర్కొన్నారు. తండ్రిగా తన కొడుకు ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధను, వైద్యుడిపై ఉన్న గౌరవాన్ని ఈ పోస్ట్ ద్వారా చిరంజీవి చాటుకున్నారు. సర్జరీ విజయవంతం కావడంతో రామ్ చరణ్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల సూచనల మేరకు కొద్దిరోజుల విరామం తర్వాత ఆయన తిరిగి ’పెద్ది’ షూటింగ్‌లో పాల్గొననున్నారు. అయితే, మెగాస్టార్ స్వయంగా అప్‌డేట్ ఇవ్వడంతో అభిమానులు ఊపిరి పీల్చుకుని, రామ్ చరణ్ త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పెద్ది టీమ్ కూడా స్పందించింది. చరణ్ తిరిగి షూటింగ్‌లో కూడా పాల్గొనబోతున్నట్టుగా తెలిపింది. గాయం చిన్నదే కావడంతో సినిమా పనులకు పెద్దగా ఆటంకం కలగదని రామ్ చరణ్‌తో పాటు చిత్ర యూనిట్ భావిస్తోంది. ఏప్రిల్ 30న పెద్ది రిలీజ్ కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.



## ఆదర్శ కుటుంబంలో

# బుట్టబొమ్మ..

### - పూజా హెగ్డేకి త్రివిక్రమ్ మళ్లీ ఛాన్స్ ఇస్తున్నారా?

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ‘ఆదర్శ కుటుంబం - AK 47’. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్ గ నటిస్తుండగా.. పూజా హెగ్డే కూడా ఈ మూవీలో భాగం కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో పూజాతో ‘అరవింద సమేత వీర రాఘవ’, ‘అల వైకుంఠపురంలో’ సినిమాలు చేసిన త్రివిక్రమ్.. మరోసారి ఆమెతో వర్క్ చేయబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది.‘సంక్రాంతికి వస్తున్నాం’ తర్వాత విక్టరీ వెంకటేష్ నటిస్తున్న సినిమా ‘ ఆదర్శ కుటుంబం - AK 47’. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి భారీ షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేశారు. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. అయితే ఇప్పుడు ఈ సినిమాలో పూజా హెగ్డే కూడా భాగం కాబోతున్నట్లు ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో పూజా హెగ్డే పలు చిత్రాల్లో హీరోయిన్ గా నటించింది. వీరికలయికలో వచ్చిన ‘అరవింద సమేత వీర రాఘవ’, ‘అల వైకుంఠపురంలో’ సినిమాలు రెండూ బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించాయి. ‘గుంటూరు కారం’ సినిమాలోనూ బుట్టబొమ్మనే నటించాల్సింది కానీ.. చివరి నిమిషంలో ఆమెను తప్పించారు. పూజానే తప్పుకుందా, మేకర్స్ తప్పించిందా అనే సంగతి తెలియదు కానీ.. ఆ తర్వాత ఆమెకు తెలుగులో అవకాశాలు కరువయ్యాయి. అయితే మళ్లీ ఇన్నాళ్లకు త్రివిక్రమ్ మరోసారి పూజాకి ఛాన్స్ ఇవ్వబోతున్నారని టాక్ వినిపిస్తోంది.ఆదర్శ కుటుంబం సినిమా కోసం పూజాహెగ్డే పేరును పరిశీలిస్తున్నారట త్రివిక్రమ్. ఇందులో శ్రీనిధి శెట్టి మెయిన్ హీరోయిన్ కాగా.. ఓ స్పెషల్ సాంగ్‌ను పూజాహెగ్డేతో ప్లాన్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. త్రివిక్రమ్ గతంలో ఇలియానా, సమంత వంటి హీరోయిన్లను తన సినిమాల్లో రిపీట్ చేశారు. ఈ క్రమంలో ఇప్పుడు పూజా హెగ్డేని కూడా రిపీట్ చేస్తున్నారని అంటున్నారు. ఇందులో నిజమెంతనేది తెలియాలంటే, అధికారిక ప్రకటన వచ్చే వరకూ ఆగాల్సిందే.ఇకపోతే ఈ మూవీలో నారా రోహిత్ నటిస్తున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. నెగెటివ్ షేడ్స్ ఉన్న పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తారని, ఇది కథలో చాలా కీలకమైన రోల్ అని చెప్పుకుంటున్నారు. ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47’ చిత్రాన్ని హారిక ఢ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ(చినబాబు) నిర్మిస్తున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్నారు. రవి కె.చంద్రన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారని సమాచారం.వెంకటేష్ - త్రివిక్రమ్ సినిమాని 2026 సమ్మర్ లో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ ఈ ఏడాది సెకండాఫ్ లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇటీవలే కీలకమైన షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేశారు, దీని కోసం అన్నపూర్ణ స్టూడియోస్ లో భారీ సెట్ నిర్మించినట్లు టాక్. ఇప్పటికే రిలీజైన టైటిల్ ఢ ఫస్ట్ లుక్ పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంది.

# ఆకట్టుకుంటున్న తిరువీర్ కొత్త సినిమా టీజర్

‘మసూద’, ‘పరేషాన్’ ‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్’ వంటి వైవిధ్యమైన సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ తిరువీర్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘పాపం ప్రతాప్’. ఏ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ చిత్ర టీజర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ఒక సామాన్యమైన వ్యక్తి జీవితంలో ఎదురయ్యే వింతైన, వినోదాత్మకమైన సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా సాగనుందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. టైటిల్‌కు తగ్గట్టే హీరో ‘ప్రతాప్’ పడే కష్టాలు, చుట్టూ ఉన్న పరిస్థితులు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సహజసిద్ధమైన నటనతో ఆకట్టుకునే తిరువీర్, ఈ సినిమాలో కూడా తనదైన మేనరిజమ్స్‌తో మరోసారి మెప్పించనున్నాడు. టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమా మూడ్‌ను చక్కగా ఎలివేట్ చేశాయి. కేవలం వినోదం మాత్రమే కాకుండా, కథలో ఏదో బలమైన పాయింట్ ఉందనే సంకేతాన్ని టీజర్ ఇస్తోంది. ప్రస్తుతం అన్ని పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎస్.పీ దుర్గ నరేష్ దర్శకత్వం వహిస్తుండగా.. రాకేష్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాయల్ రాధకృష్ణ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుంది.



# దేవతలగుట్టపై సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

**- దేవాలయ ధర్మకర్త మండాడి శివారెడ్డి**



బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) బాలాపూర్ మండల పరిధిలోని చరిత్రాత్మకమైన దేవతల గుట్టపై గల స్వయంభూ హనుమాన్ ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాలయ ధర్మకర్త మంధాడి శివారెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ నవమి నాడు లోక కళ్యాణార్థం, అభిజిత్ లగ్నం పునర్వసు నక్షత్రంతో కూడిన కర్కాటక లగ్నంలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులవ్వలని కోరారు. భక్తుల సౌకర్యార్థం కొండపై మంచినీటి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## సమాజంలో ఐక్యత - సౌభాతృత్వం పెంపొందాలి

- శ్రీరాముని ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శనం
- శ్రీరామ నవమి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు
- భాజపా కిసాన్ మోర్చా వేములవాడ పట్టణ పూర్వ అధ్యక్షులు : కొప్పెర సంతోష్ రెడ్డి



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణానికి చెందిన భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా పూర్వ అధ్యక్షులు కొప్పెర సంతోష్ రెడ్డి శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరాముడు భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడని అన్నారు. ఆయన జీవితం సత్యం, ధర్మం, కర్తవ్య నిష్ఠకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ప్రేమ, ఐక్యత పెంపొందాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ పవిత్ర పర్వదినం సందర్భంగా ప్రజలందరూ ఆనందోత్సాహాలతో వేడుకలను జరుపుకోవాలని, అలాగే సామాజిక బాధ్యతను గుర్తుంచుకొని పరస్పరం సహకారం పెంచుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని కోరుతూ తన శుభాకాంక్షలు తెలియజేశారు.

## శాంతి - సౌహార్ధానికి శ్రీరాముడు ప్రతీక

- ప్రజలందరికీ "శ్రీరామ నవమి" శుభాకాంక్షలు
- రామన్నపేట గ్రామ సర్పంచ్ : చింతలపల్లి కవిత - వెంకట్ రెడ్డి



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ )** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, రామన్నపేట గ్రామ సర్పంచ్ చింతలపల్లి కవిత - వెంకట్ రెడ్డి శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముని ఆచారాలను ఆదర్శంగా తీసుకొని నిజాయితీ, న్యాయం, క్రమశిక్షణతో జీవించాలని పిలుపునిచ్చారు. ఈ పవిత్ర పర్వదినం అందరికీ ఆయురారోగ్యాలు, ఆనందాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.

## వేములవాడలో నేడు అత్యంత వైభవంగా రాములోరి కళ్యాణ వేడుకలు

- రాజన్న క్షేత్రంలో కళ్యాణ ఉత్సవాలకు సర్వం సిద్ధం
- భారీగా తరలివచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు
- రాజన్నాలయ ఈఓ : రమాదేవి



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో నేడు శుక్రవారం (మార్చి 27న) నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణోత్సవంకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. రాజన్న ఆలయ పార్కింగ్ ప్రాంగణంలో వైభవంగా జరగనున్న ఈ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) రమాదేవి గురువారం క్షేత్రస్థాయిలో కళ్యాణ వేదిక వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా




షామియానాలు, చల్లని తాగునీరు, సౌకర్యవంతమైన కూర్చునే ఏర్పాట్లు, సులభ దర్శనం వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. అలాగే, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలని ఈవో ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# అమాయక ప్రజల ఆశలు ఆవిరి

- ధర్పల్లిలో నకిలీ పత్రాలతో భూ దందా
- రిక్క దినకర్, గ్రామ కార్యదర్శి కార్తీక్ కలిసి చేసిన మాయజాలం






**ధర్పల్లి (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల్ దమ్మన్నపేట గ్రామంలో అమాయక ప్రజల ఆశలను రిక్క దినకర్ గ్రామ కార్యదర్శి కలిసి చేసిన మాయజాలం కలకలం సృష్టిస్తుంది. బాధితుడు కమ్మరి లింగాచరి తెలిపిన వివరాల ప్రకారం తన ప్లాట్ ఇతరులకు రిక్కా దినకర్ వేరే వారికి నకిలీ పత్రాలు సృష్టించి, ఒకే ప్లాట్‌ను పలువురికి రిజిస్ట్రేషన్ చేస్తూ లక్షల రూపాయల మోసానికి పాల్పడుతున్నారనీ అన్నారు. ఈ భూ కబ్జా ఉదంతం దమ్మన్నపేటలో స్థానికంగా కలకలం రేపుతోంది. ధర్పల్లి మండల యూత్ ప్రెసిడెంట్ రిక్క దినాకర్ కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకుంటూ ధర్పల్లి మండలం దమ్మపేట గ్రామంలో గల కమ్మరి లింగ చారి కి గవర్నమెంట్ ఎస్సీ కాలనీలో ప్లాట్ ఇవ్వడం జరిగిందన్నారు. దానిని రిక్క దినకర్ ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ చేయించినట్టు బాధితులు లాబో ధిబో మని మొత్తుకుంటున్నారు. అక్కడున్న ప్లాట్ భూమిని తమదేనని నమ్మబలికారు. నకిలీ సేల్ డీడ్లు ,ఫోర్జరీ సంతకాలతో పత్రాలు సిద్ధం చేశారు. జీ పీ సెక్రెటరీ కార్తీక్ ఇందులో పాత్ర పోషించినట్టు బాధితులు తమ ప్లాట్లలో తీరా విచారిస్తే, ఆ భూమి ఇప్పటికే వేరే వ్యక్తుల పేరిట ఉందని, నిందితులు సృష్టించినవి అన్ని దొంగ పత్రాలని తేలింది. ఒకే ప్లాట్‌ను వేరే వారిపై రిజిస్ట్రేషన్ చేసినట్లు కూడా గుర్తించారు. బాధితులకు న్యాయం చేసి, నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సర్పంచ్ అనుముల భాస్కర్ ఆధ్వర్యంలో వైభవోపేతంగా రాములోరి కళ్యాణ వేడుకలు


- పంచామృతాభిషేకాలతో ప్రారంభమైన శ్రీరామ నవమి వేడుకలు
- గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలి
- భక్తులకు సకల సౌకర్యాలు సిద్ధం
- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, నీలోజిపల్లి గ్రామంలోని శ్రీ రామాలయంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్, పాలకవర్గం సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి అలంకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, నేడు శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సంప్రదాయబద్ధంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ దివ్య వేడుకల్లో గ్రామ ప్రజలందరూ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్ వంటి సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. కళ్యాణోత్సవం అనంతరం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామంలోని యువత, మహిళా సంఘాలు, వాలంటీర్లు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు

# రజత కాంతుల్లో మెరిసిపోతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవ శోభ





ఒంటిమిట్ట (ప్రశ్న న్యూస్) ఒంటిమిట్టలోని పవిత్రక్షేత్రమైన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల హృదయాలను పరవశింపజేసేలా టిటిడి అత్యంత వైభవంగా విద్యుత్ అలంకరణలను చేపట్టింది. వెన్నెలను తలపించే వెలుగుల మధ్య ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసరింపజేస్తూ భక్తులకు దివ్యానుభూతిని అందిస్తున్నాయి. ఒంటిమిట్ట ఆలయం లోపల వెలుపల ప్రాంతాలు, పరిసర ప్రాంతాలు, టిటిడి భవనం, వాహన మండపం, ఆలయం ముందు గార్డెన్, ప్రధాన కూడళ్లు, అలాగే ఒంటిమిట్ట నుండి మాధవవరం వరకు మార్గమంతా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నాలుగు మాడ వీధులు, పుష్కరిణి, పార్కింగ్ ప్రాంతం, ఒంటిమిట్ట పరిసర ప్రాంతాలు, కల్యాణ వేదిక తదితర ప్రాంతాలు రాత్రివేళల్లో రజత కాంతులతో మెరిసిపోతూ బ్రహ్మోత్సవాలకు అపూర్వమైన శోభను చేకూర్చుతున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా 30కి పైగా దేవతామూర్తుల పెద్ద బొమ్మలు, 70కు పైగా ప్రత్యేక డిజైన్ బోర్డులు, అలాగే అనేక అద్భుత ఇల్యూమినేషన్ బోర్డులను ఏర్పాటు చేశారు. దేవాతామూర్తుల పెద్ద బొమ్మలలో శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ కల్యాణం, అయోధ్య రాముడు, రామబాణం, ఏనుగు మీద శ్రీవారు, గరుత్మంతుడిపై శ్రీవారు, శ్రీ పద్మనాభ స్వామి, అమ్మవారి త్రీడీ రూపం, శ్రీరాముడు -- శబరి, దశావతారాలు, అష్టలక్ష్ములు వంటి దివ్యరూపాలు విద్యుత్ కాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సౌందర్యాన్ని పంచనున్నాయి. అదేవిధంగా 20 వేల సీరియల్ లైట్స్, 10 వేల ఫ్లడ్ లైట్లు, 500 రంగు రంగుల లైట్లు, 40 జనరేటర్లు, వివిధ రకాల తోరణాలతో ఒంటిమిట్ట అంతా ప్రకాశవంతంగా మారి బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత పెంచనున్నాయి.

### ప్రత్యేక ఆకర్షణగా కల్యాణ వేదిక

ఏప్రిల్ 1న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు వేలాది మంది భక్తులు తరలి రానున్నారు.

వారి సౌకర్యార్థం కల్యాణ వేదిక పరిసరాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతం ఆలయ పరిసరాల్లో 24 ఎల్.ఈ.డి వీడియో డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా భక్తులు ఎక్కడి నుంచైనా శ్రీ సీతారాముల దివ్య కల్యాణాన్ని కనులారా వీక్షిస్తూ భక్తి పరవశంలో తేలియాడేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# రైతులకు కోర్టు సమన్లు

# అధికారికి పదోన్నతులు: భూపతి

- అన్నదాతకు తప్పని న్యాయ చిక్కులు,ఏడేళ్లలో పదుల సార్లు కోర్టుకు హాజరు
- అప్పటి అధికారికి పదోన్నతులు (వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ లో హైదరాబాద్ రంగారెడ్డి విజిలెన్స్ అధికారిగా విధులు)
- అభం శుభం తెలియని రైతుల పై కేసులు చేవెళ్ల రైతులు చిక్కుల్లో, వ్యవసాయం వదిలి, న్యాయం కోసం కోర్టు చూట్టు ఏడేళ్లుగా చెక్కర్లు






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో రైతుల బాధలు సర్కార్ కు పట్టవా. కరోనా సమయంలో సైతం కుటుంబాన్ని వదిలి పొలం పనులు చేస్తూ మరింత ఎక్కువ మోతాదులో పంటలను సాగు చేస్తూ ప్రజల అవసరాలను తీర్చడానికి అహర్నిశలు శ్రమించిన అన్నదాతలు.ఏ పాపం తెలియని రైతులు వారు, పండించే పంటలకు గిట్టుబాటు ధరతో పాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు సరైన సమయంలో అందే విధంగా అధికారులను కోరుతారు తప్ప మరేమీ ఇతర విషయాల్లో జోక్యం చేసుకోరు.వారి జీవితాన్ని పనంగ పెట్టి పంటలను సాగు చేస్తున్న యోధులు.అయినా కూడా కాలం సహకరించిక అతివృష్టి అనావృష్టి కారణంగా చేతికి వచ్చిన పంటలు కళ్ల ముందే పనికి రాకుండా పోతుంటే కన్నీటిపర్యంతమవుతూ, వారి ఆవేదన అరణ్యరోధనగానాలుగు దిక్కులు పెల్లు పెల్లు మని వినిపించేలా శోక సముద్రంలో మునిగిపోతున్న అన్నదాతలు,ప్రభుత్వం మాత్రం కళ్ళు,చెవులు ముసుకుంటాయాని చేవెళ్ల రైతన్న ఆవేదనతో మొన్న సికింద్రాబాద్ సివిల్ కోర్టు ఆవరణలో పంచుకున్న సందర్భం.

### గతం తెచ్చిన కన్నీటి గాథ..

తెలంగాణ రాష్ట్రంలో రైతులకు కూరగాయల మార్కెట్ యార్డ్ లల్లో ఎదురరౌతున్న ఇబ్బందులు పై గతంలో (30/10/2019) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో "హమాలీలు" తలెత్తినా సమస్య పై చేవెళ్ళ, వికారాబాద్ పరిసర ప్రాంతాల రైతులు మూకుమ్మడిగ నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. బోయిన్ పల్లి మార్కెట్ అధికారులు, పాలకమండలి కమీషన్ ఏజెంట్లకు, హమాలీలకు" తొత్తులుగా వ్యవహరిస్తున్నారనియార్డ్ లో నిరసనలు చేపట్టారు.

**ఇక భవిష్యత్తులో రైతన్న డిమాండ్ లు** :1) కమీషన్ 100/ రూపాయలకి నాలుగు రూపాయలు తీసుకోవాలని.
2) లోకల్ సీజన్నీ పక్కకు పెట్టి ఇతర రాష్ట్రాలకు చెందిన కూరగాయలు దిగుమతి కావద్దు.
3)బార్దాని బరువు తగ్గించవద్దని.
4) ప్రతి నెలా అమావాస్యకు,కమీషన్ ఏజెంట్లు మరణించిన సందర్భంలో మార్కెట్ కి సెలవు ప్రకటించకుడదు.ఇలా పలుడిమాండ్లతో మార్కెట్ లో రైతులు నిరసనలు శాంతియుతంగా తెలిపే క్రమంలో అధికారులకు, రైతులకు మాట మాట పెరగడంతో పోలీసులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించారు.ఈ నేపథ్యంలో అప్పటి బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ పద్మా హర్ష పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలువురు పై కేసు నమోదు చేసిన తిరుమల గిరి పోలీసులు.అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నదాతల పై కేసు నమోదు చేసినట్లు సెక్రటరీ తెలిపినట్లు సమాచారం.కానీ మార్కెట్లో పలువురు కుమ్మక్కై అభం శుభం తెలియని అమాయక రైతుల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా వారిపై కక్షపూరితంగా కేసులు బనాయించి రైతులపై కేసులు నమోదు చేసి ఏడు సంవత్సరాలుగా సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు చుట్టూ వాయిదాల మీద వాయిదాలకు హాజరై తున్నారు చేవెళ్ల రైతులు. గతఏడేళ్లుగా కోర్టు మెట్లు ఎక్కుతూ దిగుతూ,మా విలువైన సమయాన్ని వృధా చేస్తున్నారని, మాకేమో తీరని కష్టాలు, అప్పటి అధికారులకు మాత్రం పదోన్నతులు ఇదెక్కడి న్యాయం అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. పాలకులు ఓటు బ్యాంకు రాజకీయాలతో వ్యవహరిస్తుంటే, అధికారులు ప్రమోషన్ల కోసం పాకులాడుతున్నారు. ఏడేళ్లనుంచి వ్యవస్థ అంటే ఏమిటో అర్థం అవుతోందని, అసలు ఊరు వదిలి బయటకు వెళ్లనిమాకు ఈ ఏడేళ్లలో చాలా విషయాలు దొహదపడ్డాయనిచెబుతున్నారు. పొలం,ఇల్లు తప్ప మరో విషయం తెలియని రైతులకు మరో ప్రపంచాన్ని పరిచయం చేసిన వ్యక్తులు మా కన్నీళ్లు విలువవారికెమీ తెలుసు అన్నారు. ఇప్పటికైనా న్యాయ మూర్తులు, సర్కారు రైతులు పట్ల కాస్త ఆలోచిస్తే బాగుంటుందని చేవెళ్ల కు చెందిన రైతు భూపతి రెడ్డి అభిప్రాయపడుతున్నారు .సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆవరణలో ఉన్న చేవెళ్ల రైతులు చింపుల సత్యనారాయణ రెడ్డి, యాలాల కరుణాకర్ రెడ్డి, సీ.మల్లేష్.కే.రాజిరెడ్డి, కే.శ్రీరాం రెడ్డి తదితరులు ఉన్నారు.

# సీఎం రేవంత్ దక్షిణాది ఉద్యమం

## - కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి సమస్యలేనా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నియోజకవర్గాల పునర్విభజన , సీట్ల పెంపు అంశం ఇప్పుడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో పెను సంచలనానికి కేంద్ర బిందువుగా మారింది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే వాదనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలంగా వినిపిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునివ్వడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అయితే ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇంకా అధికారికంగా ఎటువంటి స్పష్టమైన పాలసీని ప్రకటించలేదు.

### జాతీయ స్థాయి చిక్కుముడి

కాంగ్రెస్ పార్టీకి ఇది కత్తి మీద సాము లాంటి వ్యవహారం. ఒకవేళ దక్షిణాదికి అన్యాయం జరుగుతోంది అని కాంగ్రెస్ గట్టిగా ఉద్యమిస్తే, అది ఉత్తరాది రాష్ట్రాల్లోని ఓటర్లను కించపరిచినట్లు అవుతుందనే భయం జాతీయ నాయకత్వంలో ఉంది. ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో జనాభా ఎక్కువగా ఉన్నందున అక్కడ సీట్లు భారీగా పెరుగుతాయి. ఆ రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. జాతీయ పార్టీగా దేశమంతటా ఒకే విధానాన్ని అనుసరించాల్సి ఉండటంతో, అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది.

### రేవంత్ రెడ్డి తెలంగాణ ఫస్ట్ వ్యూహం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధోరణి చూస్తుంటే ఆయన జాతీయ రాజకీయాల కంటే తెలంగాణ, దక్షిణాది ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నట్లు కనిపిస్తోంది. జాతీయ నాయకత్వం ఆలోచనలతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సెంటిమెంటును పట్టుకోవడంలో ఆయన సిద్ధహస్తుడు. దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో నష్టం జరిగితే, అది నిధుల కేటాయింపు, రాజకీయ ప్రాతినిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే, పార్టీ లైన్ కంటే ప్రాంతీయ ప్రయోజనాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

### అన్యాయం జరుగుతుందా.?

నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ. 50 శాతం సీట్లు పెంచాలనే ప్రతిపాదన అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది కాబట్టి, దీన్ని కేవలం ఒక ప్రాంతానికి అన్యాయంగా చూడలేమని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. అయితే, దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, జనాభా పెంచుకున్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు ఇవ్వడం అనేది మంచి పని చేసిన వారికి శిక్ష వేయడమే అనే వాదనలోనూ పస ఉంది. ఈ క్లిష్టమైన సమస్యను నిపుణులు, మేధావులు లోతుగా విశ్లేషించాల్సిన అవసరం కనిపిస్తోంది.

### ప్రభావితమయ్యే జాతీయ రాజకీయాలు

దేశవ్యాప్త ప్రభావం చూపే ఇటువంటి సున్నితమైన అంశాలపై ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా ఉద్యమానికి పిలుపునివ్వడం సామాన్యమైన విషయం కాదు. ఇది భవిష్యత్తులో కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై, అలాగే కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై ప్రభావం చూపవచ్చు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ బలంగా ఉన్న తరుణంలో, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ ఉత్తరాదిని వ్యతిరేకిస్తోంది అనే ముద్ర పడకుండా కాంగ్రెస్ అధిష్టానం ఎలా మేనేజ్ చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. డీలిమిటేషన్ అంశం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను లేదా భిన్నమైన ఆలోచనా ధోరణులను బయటపెట్టింది. రేవంత్ రెడ్డి తనదైన శైలిలో దక్షిణాది సెంటిమెంటును రగిలిస్తుంటే, జాతీయ నాయకత్వం మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది.

## సాయిబాబా విగ్రహ ప్రతిష్ట చేసి

# 22 సంవత్సరాలు

### అన్న వితరణ చేసిన బ్యాంక్ ఆఫ్ జిరాక్స్ ఓనర్ జనార్దన్ రెడ్డి



తార్నాక (ప్రశ్న న్యూస్)తార్నాక చౌరస్తాలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అక్కడి గణపతి ఆలయంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్టకు 22 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ జిరాక్స్ ఓనర్ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఉదయం నుంచే ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. సాయిబాబాకు మాజీ కార్పొరేటర్ ఎం ఆర్ శ్రీనివాసరావు భక్తులతో పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ సాయిబాబా విగ్రహ ప్రతిష్ట జరిగిన రోజున ప్రతి సంవత్సరం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని తెలిపారు. భక్తుల సహకారంతో కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో సేవ కార్యక్రమాల్లో భాగమయ్యారు.

## కంపెనీలేమో ఇక్కడ.. సీఎస్ఆర్ నిధులు అక్కడా?

### - కంపెనీల తీరుపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఇప్పటివరకు వచ్చిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులు ఆశించినస్థాయిలో లేవని, తెలంగాణలో కంపెనీలను ఏర్పాటు చేసి, సీఎస్ఆర్ నిధులను వేరేచోట ఖర్చు పెడితే ఎలా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రానికి మరిన్ని నిధులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు ఇచ్చే నిధులు వినియోగమయ్యేలా చూడాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమావేశమయ్యారు. సీఎస్ఆర్ నిధుల సమీకరణతో పాటు, వాటిని సమర్థంగా వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున అభినందించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలున్న కార్యక్రమాల వివరాలను సమన్వయం చేసే బాధ్యత ఈ సెల్ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా సీఎస్ఆర్ పోర్టల్‌ను సిద్ధం చేయాలని అన్నారు. వివిధ రాష్ట్రాల్లో సీఎస్ఆర్ నిధుల సమీకరణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అన్నారు.

## తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు నోటీసులు

### - బీఆర్ఎస్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ స్పీకర్ ట్రైబ్యునల్‌కు రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో స్పీకర్ ట్రైబ్యునల్‌తో పాటు అనర్హత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్ కుమార్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. పార్టీ మారిన ఇద్దరు ఎమ్మెల్యేలపై సభాపతి ట్రైబ్యునల్ చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వారు బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ లోకి మారారని కోర్టుకు తెలిపారు. అయినప్పటికీ స్పీకర్ చర్యలు తీసుకోలేదని అన్నారు. స్పీకర్ ట్రైబ్యునల్ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. అలాగే పార్టీ మారిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## అబుదాబిపై ఇరాన్ క్షిపణి దాడి

### - శకలాలు మీద పడి భారతీయుడి మృతి



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు విషాదానికి దారితీశాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబిలో గురువారం జరిగిన ఓ ఘటనలో ఒక భారత జాతీయుడు ప్రాణాలు కోల్పోయారు. మరొక భారతీయుడు గాయపడ్డారు. గగనతలంలో పేల్చివేసిన బాలిస్టిక్ క్షిపణికి చెందిన శకలాలు జనావాసాలపై పడటంతో ఈ ఘోరం జరిగింది. ఈ దుర్ఘటనలో మొత్తం ఇద్దరు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనపై అబుదాబి మీడియా ఆఫీస్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు ఓ బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా అడ్డగించి కూల్చివేశాయని తెలిపింది. అయితే, ఆ క్షిపణి శకలాలు అబుదాబిలోని స్వీహాన్ వీధిలో పడ్డాయని పేర్కొంది. ఈ ప్రమాదంలో ఒక భారత, ఒక పాకిస్థాన్ జాతీయుడు మరణించారని ధృవీకరించింది. గాయపడిన ముగ్గురిలో ఒక యూఏఈ, ఒక జోర్డాన్, ఒక భారత జాతీయుడు ఉన్నారని, వారికి చికిత్స అందిస్తున్నామని వివరించింది. ఈ ఘటనలో పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి.పశ్చిమాసియాలో ఫిబ్రవరి 28 నుంచి మొదలైన ఘర్షణల పర్యవసానంగానే ఈ దాడులు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీతో పాటు పలువురు సైనిక ఉన్నతాధికారులు మరణించారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్.. పశ్చిమాసియాలోని అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలు, వారి మిత్రదేశాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగుతోంది. ఇరాన్ నుంచి వస్తున్న క్షిపణి, డ్రోన్ ముప్పులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వినిపిస్తున్న భారీ శబ్దాలు క్షిపణులను అడ్డగించడం వల్లే వస్తున్నాయని స్పష్టం చేసింది. ఈ ఘటనపై ప్రజలు అనవసరపు వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక వర్గాల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని అబుదాబి అధికారులు విజ్ఞప్తి చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588